సంపుటి 14 సంచిక 1&2 జనవరి - ఏప్రిల్ 2026

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-13 Issue-6



# అడవిని కాపాడిన 'కథ'ల శక్తి

## శాస్త్రం జీవనాన్ని మెరుగు పరుస్తుంది..... కానీ కథలు ప్రపంచాన్ని మారుస్తాయి



కొన్ని సంవత్సరాల క్రితం అడవుల్లో నక్కలు క్రమంగా కనుమరుగవుతున్నాయని గమనించిన రాజు తీవ్రంగా ఆందోళన చెందాడు. ఈ జంతువును రక్షించాలనే సంకల్పంతో, ఆయన తన శాస్త్రవేత్తలను పిలిపించి, నక్కల సంరక్షణకు మార్గాలు కనుగొనమని ఆదేశించాడు. శాస్త్రవేత్తలు అనేక ప్రణాళికలు రూపొందించారు..... రక్షిత ప్రాంతాల ఏర్పాటు, బందీ పెంపకం కార్యక్రమాలు, ఇంకా కొందరు క్లోనింగ్ వంటి ఆధునిక పద్ధతులను కూడా సూచించారు. కొంత కాలం వరకు ఈ ప్రయత్నాలు ఫలితాన్నిచ్చాయి. నక్కల సంఖ్య కొద్దిగా పెరిగింది.

కానీ ఆ విజయం నిలకడగా ఉండలేదు. వేటగాళ్ళు మరింత చురుకుగా మారడంతో, నక్కలు మళ్లీ వేగంగా కనుమరుగు అవడం ప్రారంభమైంది. ఈ పరిణామంతో రాజు తీవ్ర నిరాశకు లోనయ్యాడు.

అప్పుడు ఒక జ్ఞానవంతుడైన సలహాదారుడు "కథకులు మరియు కళాకారుల సహాయాన్ని తీసుకోవాలని" ఒక కొత్త దారిని సూచించాడు.... ఆ ఆలోచన అంగీకరించిన రాజు, సృజనాత్మక వ్యక్తులను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేశాడు.

సంగీత కళాకారులు నక్కలపై హృదయాన్ని తాకే పాటలు సృష్టించారు. రచయితలు మనసును ఆకట్టుకునే కథలు వ్రాశారు. ఫొటో గ్రాఫర్లు, చిత్ర నిర్మాతలు నక్కల అందాన్ని వాటి వల్ల అరణ్యాలకు ఉన్న ప్రాముఖ్యతను సజీవంగా చూపించారు. ఈ సృజనాత్మకకృషి ప్రజల హృదయాలను తాకింది.

క్రమంగా ఈ కథలు ప్రజల్లోకి విస్తరించాయి. అవగాహన పెరిగింది. ప్రజలు ఈ ఉద్యమంలో భాగమై నక్కలను రక్షించడానికి ముందుకు వచ్చారు. వేట తగ్గింది. నక్కల సంఖ్య మళ్ళీ పెరిగింది. చివరికి అడవుల్లో సహజంగా సమతుల్యత పునరుద్ధరించ బడింది.

ముగింపు సందేశం :

శాస్త్రం మనకు మంచి జీవననాన్ని నిర్మించడంలో సహాయ పడుతుంది. కానీ మనసులను మార్చి, ప్రపంచాన్ని మెరుగుపరిచేది కథలు, కళలు.

మన సమాజం, ప్రకృతి, భవిష్యత్తు – ఇవన్నీ కాపాడటానికి ఈ రెండు కలిసే పని చేయాలి.

**గమనిక:** "శాస్త్రం జీవితం కోసం మార్గం చూపుతుంది..... కథలు జీవనానికి అర్థం ఇస్తాయి"

**- హనీబీ (35-2) ఏప్రిల్ - జూన్ 2024 సంచిక నుండి**

మూలం : Healing Forest – Forest Stories

సంపుటి-14 సంచిక - 1&2 జనవరి - ఏప్రిల్ 2026

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
ప్రొ. అనిల్ గుప్త
జాగర్లమూడి దుర్గాప్రసాద్
జమ్ములమడక శ్రీకర్
డా. కల్పనా శాస్త్రి

డిజైనింగ్ & ప్రింటింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

## ఈ సంచికలో.....

* గ్రామీణ రవాణాకు 'మహిపాల్ చారి' ఇన్నోవేషన్లు - పెట్రోల్ & ఎలక్ట్రిక్ వాహనాలు - 4
* తిరుమలశెట్టి శ్రీనివాస రావు విప్లవాత్మక ఇన్నోవేషన్ చేపలు, రొయ్యల చెరువుల కోసం 'మొబైల్ ఏరియేటర్' - 6
* పల్లెసృజన తీపి జ్ఞాపకాలతో జీవన యాత్ర ముగించిన ఈశ్వరమ్మ - 9
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 10
* గ్రాస్‌రూట్స్ ఆవిష్కరణల భవిష్యత్ దిశ - పల్లెసృజన కలలు - 12
* వ్యవసాయ వ్యర్థాలను సులభంగా తిరిగి పొలంలో వాడుకునేట్టు గా చేసే 'ఈకో బర్నర్' - పల్లెసృజన వాలంటీర్ మోహన్ వెంకట సాయి కృష్ణ సృష్టి - 13
* జనవరి - ఏప్రిల్ 2026లో జరిగిన పల్లెసృజన విశేషాలు - 14
* గడ్డి, జొన్న, మొక్క కంది కోతలు కోసే 'మల్టీ క్రాప్ హార్వెస్టర్' ఇన్నోవేటర్ కొడిముంజ ప్రవీణ్ కుమార్ సృష్టి - 16
* 'మేము త్రవ్వుతాము, ఎండబెడతాము, కలలు కంటాము' - బీహార్ రాష్ట్రం లోని 'కటిహార్' ప్రాంతంలో "సృష్టి" ఆధ్వర్యంలో జరిగిన 52వ శోధయాత్ర - 19
* ఆంధ్రప్రదేశ్ లోని 'నంద్యాల' జిల్లాలో జరిగిన 56వ చిన్న శోధయాత్ర దృశ్యాలు - 22
* డా. ఎపిజె అబ్దుల్ కలాం చిన్న పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు - 23
* పల్లె జ్ఞానం - 25
* ఎన్ఐఎఫ్ వారి 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్' 2వ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32

**కవర్ లోపలి పేజీల్లో ...**

'హనీబీ' ప్రేరణాత్మక కథ
అమ్మకానికి సిద్ధంగా ఉన్న గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# ప్రజల జ్ఞానంతో ప్రజలకై పల్లెసృజన ప్రభావపూరిత పరుగు

పల్లెసృజన ప్రయాణం నిరంతరాయంగా సాగుతుంది. 20 వసంతాలు పూర్తి చేసుకుని ప్రజల ఆదరణతో, వాలంటీర్ల ప్రమేయంతో వ్యవస్థను ప్రభావితం చేసి గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లకు పూర్తి మద్దతు లభించేలా కృషి చేస్తున్నది. ఈ ఇన్నోవేషన్లు సమాజానికి ఎంత లాభాన్ని చేకూరుస్తాయో, సమయం వృథా కాకుండా, శ్రమ తగ్గేలా, ప్రకృతికి అనుకూలంగా, ప్రజలకు ఆరోగ్యపరంగా, లాభసాటిగా, జీవన వృత్తులు ప్రజలు సాగించేలా చేసామన్న యదార్థాన్ని పల్లెసృజన వాలంటీర్లు వందల కొద్ది పాఠశాలలు, వేలకొద్ది స్కూలు విద్యార్థులకు అవగాహన చేస్తున్నారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీ విద్యార్థులకు ఈ ఇన్నోవేషన్లతో పరిచయం చేయడానికి, ప్రదర్శనలు, ఆవిష్కరణలతో చర్చలు, గ్రామాల సందర్శన, అక్కడి సమస్యల అవగాహన, ప్రకృతి - మనుషులకు - వ్యవసాయానికి వున్న అవినాభావ సంబంధం గ్రామాల్లో యాంత్రికతకు కావలసిన లక్షణాలు, గ్రామీణ ఆవిష్కర్తల ఆలోచనాతీరు, దానివల్ల సమాజానికి వచ్చే లాభాలు, అభివృద్ధికి తోడుగా ఉండే ఈ ఆవిష్కరణల లక్షణాలు, తక్కువ ఖర్చు - పెట్టుబడుల తగ్గుదల - వాటి ప్రభావం ..... ఇలా అనేక విషయాలు, కాలేజీల్లో పాఠ్యాంశాలు కాకపోయినా, జీవితంలో ఉపయోగపడే అంశాలు. గ్రామోద్ధరణకు, దేశాభివృద్ధికి తోడ్పడే ఈ ప్రధానాంశాలను పల్లెసృజన కాలేజీ విద్యార్థులకు చేరవేస్తుంది. వాలంటీర్ల సంఖ్య నిరంతరంగా పెరుగుతుండటం వల్ల ఈ కార్యక్రమాలు విస్తారంగా చేయడానికి పల్లెసృజనకు అవకాశాలు అధికమవుతున్నాయి.

చిన్న శోధయాత్రల్లో గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్ళడం, విద్యార్థులతో ఇన్నోవేషన్లను గురించి చెప్పడం, వారి సృజనాత్మకతను గ్రంథీకరణ చేయడం, వారిలో దాగివున్న ఉత్సుకతను, ప్రశ్నించే శక్తిని, క్రియాశీలతను వెలికి తీసే ప్రయత్నాలు యాత్రలో జరుగుతాయి. ఈ విధంగా పల్లెసృజన గ్రామ పాఠశాలల ఉపాధ్యాయులతో, విద్యార్థులతో సంధానం చేసుకుంటుంది. అదేవిధంగా గ్రామ రైతులకు, చేనేత కార్మికులకు పల్లెసృజన వెతికి వెలికి తీసిన గ్రామీణ ఇన్నోవేషన్లను పరిచయం చేయడం, వాటి ఉపయోగాలు, రైతులకు దానివల్ల కలిగే లాభాలన విశదీకరించడం జరుగుతుంది. మొదట్లో మమ్మల్ని అనుమానంగా, వ్యాపార సంస్థ ప్రతినిధులుగా గ్రామస్తులు  భావిస్తారు. మెల్లిమెల్లిగా పల్లెసృజన పాత్ర పూర్తిగా అవగాహన అయిన తర్వాత  ఒక గౌరవ భావంతో మాతో చర్చిస్తారు. ఒక్కసారిగా చర్చల దిశ, సమస్యా పరిష్కారాల వైపు మలుపు తిరుగుతుంది. వారి సమస్యలు, వాటికి కావలసిన పరిష్కారాలు, వారు చేసిన ప్రయత్నాలు, వ్యవస్థ ఇచ్చిన పరిష్కారాలలోని అవస్థలు అన్నీ మనసు విప్పి పరస్పర గౌరవంతో సంభాషణలు జరుగుతాయి. ఎంతో ప్రేమతో, కృతజ్ఞతతో గ్రామస్తులు పల్లెసృజన యాత్రికులకు వీడ్కోలు తెలుపుతారు. ఆ తర్వాత కొందరు గ్రామస్తులు హైదరాబాద్‌లోని పల్లెసృజన కార్యాలయానికి వివచ్చేస్తారు. మాతో ఫోన్లలో ఎన్నో విషయాలు చర్చిస్తారు. ఒక అందమైన ఆత్మీయతతో కూడిన బంధం ఏర్పడుతుంది. పరస్పర గౌరవ భావంతో, విశ్వాసంతో ఆ బంధం రోజు రోజుకూ బలపడుతుంది.

ఈ యాత్రల్లో పల్లెసృజన పత్రికలను పంచుతాం. వాటిని చదివి మరింత అవగాహనతో గ్రామస్తులు పల్లెసృజన తో బంధం పెంచుకుంటున్నారు.



# సంపాదకీయం

గ్రామీణ ఇన్నోవేషన్ల ప్రదర్శన మరో ముఖ్యమైన కార్యక్రమం పల్లెసృజన చేస్తుంది. సగటుగా వారానికి ఒక ప్రదర్శన గ్రామాల్లో కాని, ప్రాంతాల్లో కాని, రాష్ట్ర స్థాయిలో కాని, దేశ స్థాయిలో కాని పాల్గొంటుంది. ఈ వేదిక ఇన్నోవేటర్లకు, రైతులకు సమర్థవంతంగా సమస్యలను పరిష్కారాలను అర్థం చేసుకోవడానికి పూర్తిగా అవకాశం ఇస్తుంది. ఇన్నోవేటర్లకు వారి ఇన్నోవేషన్ల విస్తరణకు ఈ ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడతాయి. దాదాపు 500 ప్రదర్శనల్లో పల్లెసృజన పాల్గొన్నందుకు గర్వంగా ఉంది. పాఠకులు వీటి ప్రభావం సమాజంపై ఎంతగా ఉంటుందో ఊహించగలరు.

గ్రామీణ ఇన్నోవేటర్లకు కావలసిన సహాయం అన్ని విధాలా చేయటానికి పల్లెసృజన సదా శ్రమిస్తుంది. ఆర్థికంగా, సాంకేతికంగా, మార్కెట్ పరంగా అన్ని రకాలుగా వారి ఇన్నోవేషన్లు సమాజంలో విస్తృతం కావడానికి, వేల రైతులకు, గ్రామాలకు చేరడానికై సర్వదా కృషి చేస్తుంది.

గ్రామీణ ఇన్నోవేషన్లకు గుర్తింపు రావడం చాలా ప్రధానం. జాతీయంగా, అంతర్జాతీయంగా, స్థానికంగా, ప్రాంతీయంగా గ్రామీణ ఇన్నోవేషన్లను సతతం పల్లెసృజన అవార్డులకై నామినేట్ చేస్తుంది.

'పద్మశ్రీ' అవార్డుల నుండి రైతునేస్తం అవార్డుల వరకు ప్రతియేడు పల్లెసృజన తెలుగు ఇన్నోవేటర్లకు అవార్డులకై ప్రతిపాదిస్తుంది. నిరాశ చెందకుండా ప్రతి సంవత్సరం మన ఇన్నోవేటర్లు కనీసం ఇద్దరు అవార్డులు పొందుతున్నారు. ఈ గుర్తింపు వారికి అన్ని రకాల లాభాలు, సమాజంలో పేరు, ఆర్థిక సహాయాలు, ప్రాంతీయంగా ఇనుమడించిన ప్రాధాన్యత, ఆత్మగౌరవం..... ఇవన్నీ గ్రామీణ ఇన్నోవేటర్లకు లభిస్తున్నాయి.

పల్లెసృజనలో ఉన్న ఉత్పత్తులను గుర్తించిన, పల్లెసృజన వీరి జ్ఞానాన్ని అంతర్జాతీయంగా కూడా గుర్తింపుకై కృషి చేస్తున్నది. జనవరి 2026 లో థాయ్‌లాండ్‌లో పాల్గొన్న ఇన్నోవేటర్లకు గుర్తింపు రావడం మనకందరికీ గర్వకారణం. ఈ వివరాలు మీరు గత సంచికలో చదివి ఉంటారు.

ఇంకా ఎన్నో... ఎన్నెన్నో పథకాలు, ప్రణాళికలు ఎల్లప్పుడూ గ్రామీణ ఇన్నోవేషన్ల విస్తరణకై పల్లెసృజన సదా కృషి చేస్తునే ఉన్నది. సమాజ స్పందన ప్రోత్సాహకరంగా ఉండటం వలన పల్లెసృజన వాలంటీర్లు మరింతగా ముందుకెళ్ళాలన్న ఉత్సాహం పెరుగుతోంది. ఇవన్నీ జ్ఞాన ఆధారిత కార్యక్రమాలు. సమాజ సంక్షేమ ఆలోచనలు. గ్రామ ప్రజల జీవనాభివృద్ధికి, వారు శ్రమపడి ప్రకృతితో సంయమనం పాటించి మనందరికీ ఆహారం చేరేటట్లుగా చేస్తున్న గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు మనందరి తరుపున కృతజ్ఞతా భావంతో పల్లెసృజన ముందుకు సాగుతుంది. మీ ఆశీర్వాదాలు, సలహాలు, సూచనలు, విమర్శలు మాకు కావాలి. మరింత బలంగా, మరింత చిత్తశుద్ధితో ముందుకు సాగడానికి మీ ప్రమేయం అత్యంత అవసరం.

జనవరి - ఫిబ్రవరి 2026 పత్రిక ప్రచురణ రహితం. ఇప్పటి నుండి మీ అందరికీ డిజిటల్ రూపంలో పల్లెసృజన ద్వైమాసిక పత్రిక మీకు ఉచితంగా చేరుతుంది. ఆదరించండి, పది కాపీలు ప్రింటు చేసి మీ చుట్టుప్రక్కల వారికి పంచండి.

రానున్న ఎండా కాలంలో అన్ని జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా, ఆనందంగా వర్షాకాలం లోకి పయనిస్తారన్న ఆశతో....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

**"పల్లెసృజన విశ్వాసం"**

❖ రైతులు గ్రాహకులు కాదు సమకూర్చేవారు (ప్రొవైడర్స్) ❖ ఊళ్ళు అంతులేని బావులు కాదు - అవి ఆధారాలు (సోర్స్)




తెలంగాణ రాష్ట్రంలోని హన్మకొండ జిల్లా, పర్కాల గ్రామానికి చెందిన 'కడివెండి మహిపాల్' చారి 2013 లో 'పల్లెసృజన' పత్రిక లో ప్రచురించిన కథనం ద్వారా పాఠకుల కు చిర పరిచిత మైన వ్యక్తి. నాటి నుండి నేటి వరకు కూడా మహిపాల్ చారి తయారు చేసే వ్యవ సాయ సంబంధ యంత్రా లు, పరికరాల ద్వారా తెలంగా ణ ప్రాంతమే కాదు, యావత్ భారత దేశంలోని ఎన్నో రాష్ట్రాల లోని రైతులకు తను తయారు చేసిన వీడర్‌ను అందించడం ద్వారా జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకు న్నాడు. మొట్టమొదట చేతితో నడిపే వీడర్‌ను తయారు చేసిన మహిపాల్ చారికి 2015 లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండే షన్ ద్వారా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'రాష్ట్రపతి పురస్కారం' లభించింది.

నాటి నుండి నేటి వరకు మహిపాల్ చారి తాను ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను తయారు చేశాడు. తాను తయారు చేసిన ప్రతి ఇన్నోవేషన్ రైతుకు శ్రమ, ఖర్చు తగ్గించేవి లేదా గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేవే కావడం అతని ప్రత్యేకత గా నిలిచింది.

ఈ పరంపరలో ఇటీవల గ్రామాల్లోని రైతులకు ఎంతో ఉపయుక్తమైన, గ్రామీణ యువతకు ఉపాధి లభించేలా రవాణా కొరకు ఉపయోగ పడే ట్రాలీలను తయారు చేస్తున్నాడు. ఇటీవల ఇతను పెట్రోలు ఖర్చు కూడా లేకుండా బ్యాటరీతో నడిచేలా 'ఎలక్ట్రిక్ ట్రాలీ' తయారు చేయుటం ద్వారా గ్రామాల్లో ఉండి, సమీప పట్టణాల్లోని గోదాములు, మార్కెట్ యార్డుల్లో పని చేసే వారికి పెట్రోలు, డీజిలు కొరకు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా అందించిన వీడర్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎంతోమంది యువకులు వినియోగించు కుంటూ, స్వయం ఉపాధి పొందుతున్నారు.

అలాంటిదే ప్రస్తుతం పెట్రోలుతో నడిచేలా 'పల్సర్' బైక్‌ను ఉపయోగించి, పెద్ద ట్రాలీని తయారు చేశాడు. ఈ ట్రాలీ లో దాదాపు ఒకటిన్నర టన్నుల బరువు దాకా రవాణా చేయవచ్చు. ఈ ట్రాలీ ద్వారా గ్రామాల్లోని ఎంతోమంది యువ కులు తమ గ్రామం నుండి సమీప పట్టణాల్లోని మార్కెట్‌కు కూరగాయలు, రైతు పంటల దిగుబడులను తరలించడం ద్వారా ఎంతో తక్కువ ఖర్చుతో రవాణా సౌకర్యం అందించ గలుగుతున్నారు.

ప్రస్తుతం గ్రామాల్లో రైతులు కూలీలను పొలానికి




తీసుకు వెళ్ళటానికి కూడా ఆటోలు ఏర్పాటు చేయాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఈ ట్రాలీని గ్రామీణ యువకులు వినియోగించుకోవడం ద్వారా తాము తమ గ్రామంలోనే ఉపాధి పొందడంతో పాటు, రైతుకు కూడా ఎంతో తక్కువ ధరకు కూలీలను వారి పొలం వరకు చేర్చ గలుగుతున్నారు.

ఈ ట్రాలీ కావాలి అనుకున్న వారు తమవద్ద ఉన్న పాత బైకును మహిపాల్ చారికి అందించి తయారు చేసుకో వచ్చు. లేదా కొత్త బైకు కొనాల్సిన అవసరం లేకుండా ఆ బైకులో ఈ ట్రాలీ చెయ్యటానికి అవసరమైన భాగాలను మాత్రమే కొనుగోలు చేసి, కొత్త ట్రాలీని కూడా తయారు చేసి ఇస్తున్నాడు మహిపాల్ చారి.

పెట్రోలు భారం చాలా ఖరీదుతో కూడుకున్నది అనుకుంటే ఇదే స్థాయిలో ఎలక్ట్రిక్ ట్రాలీని కూడా తయారు చేసి ఇస్తాడు. కేవలం వారం–పది రోజుల్లో వినియోగ దారుడికి అవసరమైన ట్రాలీని తయారు చేసి ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపుతున్నాడు. ఈ ట్రాలీ తయారు చేయటానికి వినియోగదారుడు బైకు పంపితే రూ. 1 లక్ష 10 వేలకు తయారు చేసి ఇస్తాడు. లేదా బైకు కూడా అతన్నే తీసుకోమంటే రూ. 1 లక్ష 25 వేలకు తయారు చేసి ఇస్తాడు. రవాణా ఛార్జీలు అదనంగా ఉంటాయి.

గ్రామీణ రవాణా వ్యవస్థకు, ముఖ్యంగా రైతులకు ఎంతో ఉపయోగ కరమైన ఈ ట్రాలీని వినియోగించుకోవటం వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గించడం కోసం కొత్త కొత్త ప్రయోగాలు చేసి, గ్రామ అవసరాలను తీరుస్తున్న హిపాల్ చారి ఎంతో అభినందనీయుడు. ●

**ఇన్నోవేటర్ మహిపాల్ చారి ఫోన్ : 9866922168**

## ఇప్పటి వరకు 'మహిపాల్ చారి' చేసిన ఇన్నోవేషన్లు....


పవర్ వీడర్


పవర్ వీడర్


ట్రాక్టర్ క్రేన్


ఎలక్ట్రిక్ ట్రాలీ


ఎలక్ట్రిక్ ట్రాలీ


ఎలక్ట్రిక్ ట్రాలీ


మినీ బైక్ ట్రాలీ


చైనా వీడర్‌కు షాక్ అబ్జార్బర్


ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్

## తిరుమలశెట్టి శ్రీనివాస రావు విప్లవాత్మక ఇన్నోవేషన్

# చేపలు, రొయ్యల చెరువుల కోసం 'మొబైల్ ఏరియేటర్'



శ్రీనివాస రావు తయారు చేసిన ఏరియేటర్

- వీరరాఘవ రెడ్డి

గత దశాబ్ద కాలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'చేపలు, రొయ్యల' పెంపకం బాగా అభివృద్ధి పొందింది. చేపలు, రొయ్యలు చెరువుల్లోకన్నా, నదుల్లో, సముద్రాల్లో పెరిగేవి చాలా ఆరోగ్యంగా పెరుగుతాయి. నదుల్లో నీరు పారుతూ ఉండటం వల్ల చిన్న చిన్న అలల రూపంలో నీటిలోకి గాలి (ఆక్సిజన్) చొరబడటంతో ఆ ఆక్సిజన్ చేపలకు అందుతుంది. అలాగే సముద్రంలో అలలు విపరీతంగా ఉంటాయి కాబట్టి అక్కడ కూడా వాటికి ఆక్సిజన్ బాగా అందుతుండటంతో అవి ఆరోగ్యంగా, చాలా త్వరగా ఎదుగుతాయి. కానీ, చేపలు, రొయ్యలను పెంపకం చెయ్యటానికి కృత్రిమంగా ఏర్పాటు చేసిన 'చెరువు'లలో అలలు ఉండవు, నీటి పారుదల ఉండదు కాబట్టి వాటికి ఆక్సిజన్ సరిగ్గా అందక అవి చనిపోతూ ఉంటాయి.

ఈ సమస్యను కనుగొన్న తర్వాత నీటిని కదిలిస్తూ ఉండాలి అన్న విషయం తెలుసుకున్న చేపల చెరువుల రైతులు మొదట "ఏరియేటర్" తయారు చేశారు. అయితే ఇవి నీటిని పైకి వెదజల్లుతాయి. వీటిని ఒక్కో చెరువులో కనీసం 4 ఏరియేటర్లు ఏర్పాటు చెయ్యాలి. ఒక్కో ఏరియేటర్ 2 హార్స్ పవర్‌ల మోటారుతో పని చేస్తుంది. అంటే ఒక్కో చెరువుకు 8 హార్స్ పవర్‌ల శక్తి అవసరం ఈ విధంగా కరెంటు బిల్లు ఎక్కువ అవుతుంది రైతుకు.

ఈ సమస్యను పరిష్కరించాలని శ్రీనివాస రావు ఆలోచించి, 'మొబైల్ ఏరియేటర్'ను తయారు చేశాడు. ఇది దానంతట అదే చెరువు చుట్టూ తిరిగేలా మోటార్‌ను రూపొందించాడు. కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలో గల 'కొత్త మాజేరు' గ్రామానికి చెందిన తిరుమలశెట్టి కృష్ణమూర్తి, సరోజినీదేవిలకు ఇద్దరు కూతుర్లు, ముగ్గురు కుమారులు. వీరిలో రెండవ వాడైన తిరుమలశెట్టి శ్రీనివాస రావు జీవితం చిన్నతనం నుంచి ఎన్నో ఒడిదుడుకులతో సాగిన సంసారం.

తండ్రి వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. 1990 ప్రాంతంలో వీరి ప్రాంతానికి 'రొయ్యల చెరువుల' పెంపకం మొదలైంది. 1993లో శ్రీనివాస రావు తల్లి స్వర్గస్తులయ్యారు. అప్పుడు ఇతని వయస్సు 14 సం.లు. తన తమ్ముడికి 9 సం.లు, అప్పటికే తన అన్నయ్యకి పెళ్ళయింది. వీరి తల్లిగారు చనిపోయాక తన అన్న వేరే కాపురం పెట్టుకున్నాడు. ఇంట్లో తన తండ్రి, తాను, తన తమ్ముడు మాత్రమే ఉండేవారు. శ్రీనివాస రావు 9వ తరగతి నుండే రొయ్యల చెరువు వద్ద ఉండటం అలవాటు చేశాడు వీరి తండ్రి. అలా ఒంటరిగా చెరువు వద్దనే ఉండటం ఇతనికి అలవాటైంది. అలా ఒంటరిగా భయం భయంగా ఉండటం వల్ల ఇతను లాజికల్‌గా ఆలోచించిస్తూ, తన భయాన్ని దూరం చేసుకున్నాడు.

ఆ తర్వాత 2000 సం. ప్రాంతంలో తన తండ్రి మరో పెళ్ళి చేసుకున్నాడు. అప్పుడు ఇతను, ఇతని తమ్ముడు అక్కడ

ఉండలేక తాము వేరే కాపురం పెట్టుకోవాల్సి వచ్చింది. అప్పుడు శ్రీనివాస రావు వయస్సు 20, తమ్ముడికి 15 సం.లు. ఈ పరిస్థితుల్లో ఇంటర్మీడియట్ చదువును అర్ధాంతరంగా ముగించాల్సి వచ్చింది. అప్పటికే చేపల చెరువులో కొంత వరకు సంపాదించుకోగలిగాడు. ఇతని తండ్రి వీళ్ళు బయటకు వెళ్ళేటపుడు కూడా ఏమీ ఇవ్వలేదు. ఎలాగోలా కష్టపడుతూ తమ్ముడు, తాను ఆ రొయ్యల చెరువు మీదనే జీవనం సాగించేవారు.

అప్పుడు పక్కనున్న సముద్రపు నీటిని ఈ చెరువుల లోకి డీజిల్ ఇంజన్లతో నీటిని తోడేవారు. ఇతని చెరువులోకి నీళ్ళు తోడుకునేందుకు డీజిల్ కొనుగోలుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొనేవాడు. అప్పుడు మొదలైంది శ్రీనివాస రావులో సృజనాత్మకత. డీజిల్ లేకుండా చెరువులోకి నీరు తోడుకోలేమా అని ఆలోచించాడు. మొత్తానికి 'సైఫన్' పద్ధతిలో ఎటువంటి ఖర్చు లేకుండా నీరు తోడుకుని మొత్తానికి తన చెరువులో రొయ్యలను బ్రతికించుకో గలిగాడు. ఆ తర్వాత 2001లో ఇతనికి వివాహం జరిగింది. పెళ్ళయిన తర్వాత ఒక పంట బాగానే వచ్చింది. ఆ తర్వాత దిగుబడి బాగా తగ్గుతూ వచ్చింది.

రొయ్యలకు వీపరీతంగా వైరస్ రావటం శ్రీనివాస రావు గమనించాడు. అందువల్ల నష్టాలు ఎదురై చాలామంది రొయ్యల పెంపకం మానేశారు. ఇక తాను కూడా ఇంకా చెరువులనే నమ్ముకుంటే ఇంకా లోతుగా అప్పుల్లో కూరుకుపోవాల్సి వస్తుందని అనుకున్నాడు. ఇంటర్‌తో చదువు ఆగిపోయింది, కొడుకు పుట్టాడు, తమ్ముడిని చదివించుకోవాలి. ఇక ఇక్కడ ఉండటం మంచిది కాదని తన కాపురాన్ని విజయవాడకు మార్చుకుని 'కార్పెంటర్ పనిలో చెక్కలకు 'పాలిష్ చెయ్యడం' నేర్చుకుని ఆ పనిలో 4–5 సంవత్సరాలు గడిపాడు.


పాత ఏరియేటర్

ఆ తర్వాత తనకు అనుభవమున్న రొయ్యల చెరువుల్లోనే ఏదైనా వ్యాపారం చేసి సంపాదించాలి అనుకుని 'ఎండు చేపలు' కొనుగోలు చేసి, కలకత్తాకు ఎగుమతి చేసేవాడు. ఆ తర్వాత 'కరోనా' వ్యాధి వల్ల ఏమీ పని లేకుండా

## పాత ఏరియేటర్‌కు - శ్రీనివాస్ ఏరియేటర్‌కు మధ్య తేడా

| పాత ఏరియేటర్ | శ్రీనివాస్ రూపొందించిన ఏరియేటర్ |
|---|---|
| 1. నీటిని గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పైకి ఎగజిమ్మేది కాబట్టి విద్యుత్ వినియోగం ఎక్కువ. | 1. నీటిని భూమికి సమాంతరంగా వెదజిమ్ముతుంది కాబట్టి విద్యుత్ వినియోగం తక్కువ. |
| 2. ఒక్కో చెరువులో కనీసం 4 ఏరియేటర్లు – ఒక్కో దానికి 2 హార్స్‌పవర్‌ల మోటారు. మొత్తం 8 హెచ్‌పి మోటార్లు కావాలి. | 2. చెరువుకు ఒక్క ఏరియేటర్ చాలు – 3 హార్స్ పవర్‌ల మోటారుతో నడుస్తుంది. |
| 3. వీటిని చెరువులో స్థల మార్పిడి చేస్తూ ఉండాలి. కాబట్టి కూలీల పని ఖర్చు ఎక్కువ. | 3. చెరువు మొత్తం 360 డిగ్రీలు తిరుగుతూ పని చేస్తుంది కాబట్టి కదల్చటానికి కూలీల అవసరం లేదు. |
| 4. ఇది వెదజల్లే నీటి వల్ల చేపలకు లభించే ఆక్సిజన్ శాతం తక్కువే. సరిపడే ఆక్సిజన్ అన్ని చేపలకు లభించదు. | 4. ఇది సమాంతరంగా వెదజల్లుతుంది కాబట్టి చెరువులో నీరు మొత్తం ప్రవాహంలా వుండి చేపలకు ఆక్సిజన్ శాతం చాలా ఎక్కువ. |
| 5. నీటిని 3 అడుగులు పైకి, 5 అడుగుల వెడల్పులో చిమ్ముతుంది. | 5. నీటిని 360 డిగ్రీలలో 90 అడుగుల వెడల్పులో భూమికి సమాంతరంగా వెదజల్లుతుంది. |
| 6. చేపలకు వేసే మేతను, వ్యర్థాలను చెరువు మధ్యలోకి పంపుతుంది కాబట్టి త్వరగా అది మురిగిపోయి, విష వాయువులు వెలువడటం వల్ల చేపల ఆరోగ్యం దెబ్బ తింటుంది. | 6. ఇది చుట్టూ తిరుగుతూ నీటిని వెదజిమ్ముతుంది. చెరువులో వ్యర్థాలు ఏవీ పేరుకు పోవు, చేపల ఆరోగ్యం బాగా ఉంటుంది. చెరువు గట్లు కూడా కుళ్ళిపోవు. |
| 7. చేపలు ఆక్సిజన్ కోసం ఎక్కువ తిరగాల్సి వస్తుంది కాబట్టి వాటి శక్తి క్షీణిస్తుంది. అందువల్ల ఎదుగుదల తక్కువ ఉంటుంది. | 7. చేపలు ఉన్నచోటికే ఆక్సిజన్ అందుతుంది కాబట్టి తక్కువ ప్రయాణం చేయటం వల్ల వాటి శక్తి క్షీణించదు. అందువల్ల ఎదుగుదల త్వరగా జరుగుతుంది. |
| 8. చేపలు పక్వానికి రావటానికి 10 నెలల సమయం పడుతుంది. రైతుకు ఆలస్యంగా, తక్కువ ఆదాయం వస్తుంది. | 8. చేపలు 8 నెలలకే పక్వానికి వస్తాయి. కాబట్టి రైతుకు త్వరగా, ఎక్కువ ఆదాయం వస్తుంది. |
| 9. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. | 9. విద్యుత్ ఆదా 50 శాతంకన్నా ఎక్కువ. |
| 10. ఎక్కువ ఏరియేటర్లు కాబట్టి కొనుగోలు ఖర్చు ఎక్కువ. | 10. ఒకే ఏరియేటర్ కొనుగోలు కాబట్టి ఖర్చు తక్కువ. |

పోవటంతో అప్పుడు ఖాళీగా ఉండకుండా ఈ ఏరియేటర్ ను గురించి ఆలోచన మొదలు పెట్టి, కరోనా తగ్గిన తర్వాత ఢిల్లీకి వెళ్ళివచ్చి, తన ఆలోచనలకు అవసరమైన కొన్ని మోటార్లు, పరికరాలను తెచ్చుకుని మొత్తానికి ఒక ఏరియేటర్ తయారు చేశాడు. అది తాను అనుకున్నంతగా పని చెయ్యలేదు.

దాన్ని ఇంకా బాగా అభివృద్ధి చెయ్యాలి అనుకుని ఒక మెకానిక్ కొరకు తిరుగుతుండగా విజయవాడ ఆటోనగర్‌కు చెందిన మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ 'జలీల్'ను కలుసుకున్నాడు. అప్పుడు జలీల్ 'పల్లెసృజన' గురించి తెలిపి, నీ ఆలోచన చాలా బాగా ఉంది. మీరు వెంటనే హైదరాబాద్ వెళ్ళి గణేశం గారిని కలవండి, వారు తగిన సహాయం అందజేసి, మీ ఏరియేటర్‌కు మంచి గుర్తింపు వచ్చేలా చేస్తారు అని చెప్పడంతో ఇతని ఇన్నోవేషన్‌కు ఒక గుర్తింపు లభించింది.

ఈ మొబైల్ ఏరియేటర్ గురుత్వాకర్షణతో సమాంతరంగా నీటిని సుమారు 15 అడుగుల వరకు అడ్డంగా చిమ్ముతూ వెళ్తుంది. గతంలో వున్న ఏరియేటర్ నీటిని పైకి చిమ్ముతూ ఉండేది. అంటే శ్రీనివాస్ రూపొందించిన ఏరియేటర్ సుమారు 30 చదరపు మీటర్ల వరకు నీటి పై భాగాన్ని బాగా కలియబెడుతూ ఉంటుంది. ఇలా 360 డిగ్రీలలో నీటి ప్రవాహాన్ని కృత్రిమంగా సృష్టిస్తుంది.

ఇలా నీటిని కలియ త్రిప్పుతూ కృత్రిమంగా ప్రవాహాన్ని సృష్టించడం వల్ల నీటిలో ఆక్సిజన్ స్థాయి గణనీయంగా పెరుగుతుంది. సమయం ఆదా అవుతుంది. ఈ ఏరియేటర్ కేవలం 3 హార్స్ పవర్‌ల శక్తిగల మోటారుతో నడుస్తుంది. అంటే గతంలో 8 హార్స్ పవర్‌ల మోటారుకు బదులు 3 హార్స్‌పవర్‌ల మోటారు ఉపయోగించటం వల్ల రైతుకు విద్యుత్ వినియోగం ఖర్చు కూడా 50 శాతంకు పైగా గణనీయంగా తగ్గుతుంది పైగా దిగుబడి కూడా పెరుగుతుంది.

ఏరియేటర్ ఏర్పాటు చెయ్యకుంటే చేపలు ఆక్సిజన్ కోసం అప్పుడప్పుడూ నీటి పైకి వచ్చి వెళుతూ ఉండేవి. అలా చెయ్యటం వల్ల వాటి శక్తి క్షీణించి, ఎదుగుదలకు అవకాశాలు తక్కువగా ఉండేవి. అంటే నాడు చేపలు బాగా ఎదగాలంటే కనీసం 10 నెలలు పట్టేది. కానీ శ్రీనివాస్ రూపొందించిన




ఏరియేటర్ ఏర్పాటు చేసిన చెరువుల్లో 8 నెలలకే అమ్మకానికి సిద్ధంగా ఉంటాయి. అంటే 2 నెలల సమయం ఆదా అవుతుంది. పైగా చేపలు, రొయ్యలు కూడా ఎంతో ఆరోగ్యంగా ఎదిగి తూకం ఎక్కువ రావటంతో రైతుకు దిగుబడి బాగా పెరిగింది.

ఇలా చేయటం వల్ల రైతుకు మరో లాభం కూడా జరుగుతుంది. సాధారణంగా చెరువులో నీరు కదలకుండా ఉంటే మట్టి కట్ట (గట్లవెంట), అందులో పెరుగుతున్న గడ్డి కుళ్ళిపోతుంది. నీరు ఈ ఏరియేటర్ ద్వారా కదులుతూ దాదాపు నీరు పారినట్లు అవుతూ ఉండటం వల్ల మట్టి కట్టలు కూడా కుళ్ళి పోకుండా ఉండటంతో చేపలకు కూడా అనవసరపు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయి.

ఆక్వా రైతులకు ఎన్నో రకాలఉపయోగాలు, తక్కువ ఖర్చు, ఎక్కువ దిగుబడి అందేలా తిరుమలశెట్టి శ్రీనివాస్ రూపొందించిన ఈ ఏరియేటర్‌ను అందరూ వినియోగించుకుని నష్టాల బాట నుంచి విముక్తులు కావాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ఈ ఏరియేటర్‌ను ఇంకా తక్కువ ఖర్చుతో రైతుకు పని చేసేలా అభివృద్ధి చేస్తున్నాడు శ్రీనివాస్. అతనికి అవసరమైన ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించేందుకు పల్లెసృజన సహకారం అందిస్తుంది.

థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లో 2026 జనవరి, 5 నుండి 9వ తేది వరకు జరిగిన IPITEx 2026 లో పల్లెసృజన ఇన్నోవేషన్‌లను ప్రదర్శించింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ఇన్నోవేటర్ తిరుమల శెట్టి శ్రీనివాస రావు పాల్గొనడం జరిగింది. ఈ వేదికలో ఆక్వా ఫార్మ్స్ కోసం తయారు చేసిన 'మొబైల్ ఏరియేటర్'ను తయారు చేసినందుకు గాను రష్యా ఇన్వెంటర్స్ ఫోరంకు చెందిన కొర్నెలియు బిర్జోణ – బనియాసా నుండి గుర్తింపు మరియు అవార్డు పొందాడు.

ఇది ఒక గ్రామీణ రైతు సృజనాత్మకత కు గొప్ప ఉదాహరణ అయింది. ఇప్పుడు ఈ ఆవిష్కరణ అంత ర్జాతీయ గుర్తింపు పొందడం, మన గ్రామాల ప్రతిభ ప్రపంచానికి చేరిందన్న సంకేతాన్ని అందించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శ్రీనివాస రావు ఏరియేటర్‌కు విలువైన స్థానం కల్పించడానికి 'పల్లెసృజన' ఆ దిశగా కృషి చేస్తోంది. పల్లెసృజన ప్రయత్నాల వల్ల జాతీయ స్థాయిలో జరిగిన ఎమ్ఎస్ఎంఇ హ్యాకథాన్ 20–25 లో 15 లక్షల గ్రాంటు సాధించడం జరిగింది ఈ గ్రాంటు కెజిఆర్ సిఇటి విద్యా సంస్థ ద్వారా వితరణ జరుగుతుంది. దీనివల్ల శ్రీనివాస రావు ఏరియేటర్ డిజైన్ ఇంకా ఉన్నత స్థాయికి చేరుకుంటుందని, చేపల చెరువుల రైతులకు, పరిశ్రమకు అత్యంత లాభాలు భవిష్యత్తులో వస్తాయని 'పల్లెసృజన' విశ్వసిస్తోంది.

**ఇన్నోవేటర్ శ్రీనివాస రావు, ఫోన్ : 7396168485**




ఆంధ్రప్రదేశ్, కడప జిల్లాలో 24–26 జూన్, 2016 తేదీల్లో జరిగిన 19వ చిన్న శోధయాత్ర వి.ఎన్. రెడ్డి పల్లె నుండి గంగారెడ్డిపల్లె గ్రామాల మధ్య జరిగింది. 'పల్లెసృజన' ప్రతి శోధయాత్రలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో వయోవృద్ధుల జ్ఞానాన్ని సేకరించి, కృతజ్ఞతా భావంతో వారిని శాలువాతో సత్కరించడం రివాజుగా జరుగుతున్నది. ఈ క్రమంలో 'బుసిరెడ్డిపల్లె' గ్రామంలోని వయోవృద్ధురాలైన శ్రీమతి ఈశ్వరమ్మ గారిని కూడా పల్లెసృజన పలుకరించి, వారి జ్ఞానానికి ముగ్దులై గౌరవంగా శాలువాతో సన్మానించడం జరిగింది. ఇది ఆ గ్రామస్తులకు ఉద్వేగభరితమైన ఆనందానికి గురి చేసిందన్న విషయం యాత్రీకులకు అప్పటివరకు తెలియదు.

ఈ సత్కారం జరిగిన తర్వాత ఆ వృద్ధురాలు ఈశ్వరమ్మ తనకు ఎవరు తారసపడ్డా తనకు 'పల్లెసృజన' చేసిన సత్కారాన్ని వివరించి, తనకు కప్పిన శాలువను చూపిస్తూ ఎంతో ఆనందానికి గురయ్యేదట. అంతే కాదు ఆ శాలువాను ఎల్లప్పుడూ తన తలగడ క్రిందనే ఉంచుకని నిద్రించేదట !

ఆమెకు ఆరోగ్యం బాగా క్షీణించి చివరకు శరీరాన్ని వదిలి పెట్టడం జరిగింది. ఆమె కాలధర్మం చేసేముందు తన వారసులతో "నా అంతిమ సంస్కారం చేయటానికి వేరే గుడ్డను ఉపయోగించకండి, 'పల్లెసృజన' వారు నాకు కప్పిన శాలువాతోనే నా సంస్కారాలను నిర్వహించండి" అని మరీ మరీ చెప్పిందట.

ఆమె స్వర్గస్తురాలైన తర్వాత గ్రామ ప్రజలు ఆమె చివరి మాటలను మననం చేసుకుని, ఈమెను ఇంతగా ప్రభావితం చేసిన 'పల్లెసృజన'ను తలుచుకొని ఎంతో సంతోషించారట. చివరకు ఆమె కోరుకున్నట్లుగా ఈశ్వరమ్మగారి అంతిమ సంస్కారాలను ఆ శాలువతోనే నిర్వహించడం జరిగిందట!! పల్లెసృజన చేస్తున్న చిన్న సత్కారాలకు వారి మనసుల్లో ఇంతటి చెరగని ముద్ర వేస్తాయని, వారిని ఇంతగా ప్రభావితం చేస్తాయని తెలుసుకున్న మాకు చాలా ఆనందం వేసింది.

పల్లెసృజన నమ్మిన "ఒక వయోవృద్ధులు మరణిస్తే ఒక గ్రంథాలయం కాలిపోయినంత నష్టం సమాజానికి కలుగుతుంది అన్న అభిప్రాయం" సరియైనదేనని భావించి వయో వృద్ధులను సత్కరించే కార్యక్రమాలను భవిష్యత్తులో ఇంకా విస్తరింప జేయాలని న్శియించుకుంది.

**– పల్లెసృజన బృందం.**

### జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ....

2008 నుండి నేటి వరకు 'పల్లెసృజన' 56 'చిన్నశోధయాత్ర'లు పూర్తి చేసింది. ఈ యాత్రల్లో 40–60 మంది దాకా స్వచ్ఛంద కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు యాత్రీకులుగా మూడు రోజుల పాటు కేవలం నడుచుకుంటూ యాత్రా ప్రాంతాల గుండా సాగుతారు.

ఇప్పటి వరకు జరిగిన ఈ యాత్రల్లో ఎన్నెన్నో తీపి జ్ఞాపకాలు యాత్రీకుల మనసుల్లో ఉంటాయి. వాటిని మాతో పంచుకుంటే ఈ పేజీలో ప్రచురించి పాఠకులతో పంచుకుందాం. **–ఎడిటర్**



## జాతీయ అవార్డు పొందిన

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్

### అధిక దిగుబడి ఇచ్చే యస్.కె.-4 పసుపు రకం

**సచిన్ కమలాకర్ కారేకర్,** రత్నగిరి, మహారాష్ట్ర.

**జాతీయస్థాయి ద్వితీయ బహుమతి**



సచిన్ కమలాకర్ కారేకర్ (43) ఒక అభ్యుదయ రైతు. ఆయన పసుపు, కొబ్బరి, మామిడి మరియు వక్క పంటలను సాగు చేస్తూ వ్యవసాయంలో మంచి అనుభవాన్ని సంపాదించారు. ముఖ్యంగా 'అధిక దిగుబడి ఇచ్చే, వ్యాధి నిరోధకత కలిగిన పసుపు రకాలను' అభివృద్ధి చేయడంలో ఆయనకు ప్రత్యేక ఆసక్తి.

ఈ ఆసక్తితో ఆయన 'ఎంపిక పద్ధతి'ని ఉపయోగించి ఒక మెరుగైన పసుపు రకాన్ని అభివృద్ధి చేశారు. 1998లో ఆయన స్థానికంగా ప్రాచుర్యంలో వున్న 'కడ్డా' అనే పసుపు రకాన్ని తన పొలంలో నాటారు. పంటను పరిశీలించే సమయంలో కొన్ని మొక్కలు త్వరగా పండే లక్షణం కలిగి ఉండటంతో పాటు బాగా బలంగా పెరుగుతున్నాయని గమనించాడు.

ఆ మొక్కల నుంచి వచ్చిన పసుపు కొమ్ములను వేరుగా చేసి, వాటిలో వ్యాధులు లేని పెద్ద పరిమాణంలో ఉండే, ప్రకాశవంతమైన రంగు కలిగిన మరియు అధిక దిగుబడి వచ్చిన పసుపు కొమ్ములను ఎంపిక చేసుకుంటూ సాగు కొనసాగించారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం ఉత్తమ మొక్కలను ఎంపిక చేస్తూ, 2007 వరకు తన పరిశోధనను కొనసాగించారు.

చివరికి 2008 నాటికి త్వరగా పండే, బలంగా పెరిగే, వ్యాధి నిరోధకత కలిగిన మరియు అధిక దిగుబడి ఇచ్చే లక్షణాలు కలిగిన ఒక మెరుగైన పసుపు రకాన్ని అభివృద్ధి చేయగలిగారు. ఈ కొత్త రకానికి ఆయన "యస్.కె.-4" అని పేరు పెట్టారు.

ఈ పసుపు రకం ప్రత్యేకత ఏమిటంటే, ఇది ఒక హెక్టరుకు సుమారు 50 టన్నుల వరకు పసుపు దిగుబడి వస్తుంది. ఈ రకంలోని పసుపు మొక్కలు పెద్ద పరిమాణంలో ఉండి, ఆకర్షణీయమైన ఎరపు-పసుపు రంగులో ఉంటాయి. ఇది 160-170 రోజుల్లో పండే తక్కువ కాల వ్యవధి రకం కావడంతో ఎక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాకు అనుకూలంగా ఉంటుంది. అంతే కాకుండా రైజోమ్ రాట్ (మూల కుళ్ళు) వ్యాధినిరోధకత కూడా కలిగి ఉంది.

2020 ఖరీఫ్ లో ఈ రకంపై డాక్టర్ బాలాసాహెబ్ సావంత్






కొంకణ్ కృషి విద్యాపీఠం, డాపోలీ లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరిశీలనలో ఒక హెక్టారుకు సుమారు 56 టన్నుల రైజోమ్ దిగుబడి లభించినట్లు గుర్తించారు. మొత్తం 32 రకాలతో పోల్చినప్పుడు ఎస్కె-4 రకం 28 రకాలకంటే మెరుగ్గా ఉండి, ఉత్తమంగా గుర్తింపు పొందిన 'సోనా' రకంతో సమానంగా దిగుబడి ఇచ్చినట్లు నివేదక వెల్లడించింది. అలాగే 'ఆకుమచ్చ మరియు రైజోమ్ రాట్' లాంటి వ్యాధులను కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు గుర్తించారు.

సచిన్ కారేకర్ ఈ రకాన్ని తన పరిసర గ్రామాల రైతులకు కూడా అందించారు. వారు సాగు చేసి మంచి ఫలితాలు పొందినట్లు తెలిపారు. 2021 లో మహారాష్ట్రలో సుమారు ఒక లక్ష కిలోల ఎస్కె-4 విత్తనపు పసుపు కొమ్ములు అమ్ముడయ్యాయి.

ఈ పసుపు రకానికి అధికారిక గుర్తింపు పొందేందుకు ఎన్ఐఎఫ్-ఇండియా సంస్థ పివివి & ఎఫ్ఆర్ చట్టం, 2001 క్రింద నమోదు కోసం దరఖాస్తు కూడా చేసింది.

## పోర్టబుల్ కొబ్బరి పగలగొట్టి, నీరు సేకరించే యంత్రం



**బిజు నారాయణన్**, ఇదుక్కి, కేరళ

**జాతీయస్థాయి తృతీయ బహుమతి**

బిజు నారాయణన్ ఒక ఎలక్ట్రీషియన్ మరియు మెకానిక్‌గా పని చేస్తున్నారు. చిన్నప్పటి నుంచే కొత్త వరికరాలను తయారు చేయడం, వస్తువుల పనితీరును తెలుసుకోవడం ఆయనకు ఎంతో ఆసక్తి. చుట్టు ప్రక్కల ప్రజలు కొబ్బరికాయలను పగలగొట్టడానికి ఉపయోగించే విధానాలను గమనించిన ఆయన, ఒక పోర్టబుల్ (చిన్నది) కొబ్బరి పగలగొట్టి, నీరు సేకరించే యంత్రాన్ని అభివృద్ధి చేశారు.

సాధారణంగా ఎండిన కొబ్బరికాయలను రెండు సమాన భాగాలుగా పగలగొట్టి తరువాత కొబ్బెర తయారీ, వర్జిన్ కొబ్బరి నూనె (పచ్చి కొబ్బరితో తయారు చేసే నూనె) తయారీ లేదా కొబ్బరి పొడి తయారీ వంటి పనులకు ఉపయోగిస్తారు. అయితే సంప్రదాయంగా చేతి పనిముట్లతో కొబ్బరికాయలను పగలగొట్టడం ప్రమాదకరమైనది.





అదేవిధంగా ఈ పని శ్రమతో కూడినదిగా ఉండి, ఎక్కువ సమయం కూడా తీసుకుంటుంది.

ఈ సమస్యకు పరిష్కారంగా బిజు నారాయణన్ ఒక చిన్న పరిమాణంలో ఉండే తేలికగా తరలించగల యంత్రాన్ని రూపొందించారు. ఈ యంత్రంలో స్వేచ్ఛగా కిందికి పడే ఒక బ్లేడ్ మరియు క్యామ్ వ్యవస్థ అమర్చబడి ఉంటాయి. కొబ్బరికాయను యంత్రంలో ఉంచినప్పుడు బ్లేడ్ దాన్ని రెండు భాగాలుగా చీల్చివేస్తుంది.

కొబ్బరి కాయ పగిలిన వెంటనే అందులోని నీరు ఒక ఫిల్టర్ ద్వారా ప్రవహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాత్రలోకి చేరుతుంది. ఈ యంత్రాన్ని విద్యుత్ మోటారుతో లేదా చేతితో కూడా నడపవచ్చు.

ఈ యంత్రంతో ఒక కొబ్బరికాయను పగలగొట్టడానికి కేవలం కొన్ని సెకన్ల సమయం మాత్రమే పడుతుంది. చేతితో నడిపే విధానంగా గంటకు సుమారు 250-300 కొబ్బరి కాయలను పగలగొట్టవచ్చు. విద్యుత్ మోటారుతో నడిపినపుడు గంటకు సుమారు 800-900 కొబ్బరి కయలను పగలగొట్టగల సామర్థ్యం ఈ యంత్రానికి ఉంది. దీంతో కొబ్బరి ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే చిన్న స్థాయి యూనిట్లకు ఇది ఎంతో ఉపయోగకరమైన యంత్రంగా నిలుస్తుంది. ●

### పల్లెసృజన 'డిజిటల్ పత్రిక' పై మీ అభిప్రాయాలు కోరుతూ...

'పల్లెసృజన' పత్రిక ఇకనుండి ముద్రణ రూపంలో రాదు, డిజిటల్ రూపంలోనే వస్తుందని పాఠకులకు తెలియజేయడమైనది. మీరు చూస్తున్న ఈ డిజిటల్ పత్రికపై మీ అభిప్రాయాలను తెలియజేయ వలసిందిగా పాఠకులను కోరుతున్నాము. ఇంకా ఈ డిజిటల్ పత్రికలో మీరు ఏమైనా మార్పు, చేర్పులు కోరుకుంటుంటే నిర్మొహమాటంగా మాకు తెలియజేస్తే వీలైనంత వరకు మీ అభిరుచి మేరకు మార్పులు చేయుటానికి ప్రయత్నిస్తామని తెలియజేస్తున్నాము. -ఎడిటర్

# గ్రాస్‌రూట్స్ ఆవిష్కరణల భవిష్యత్ దిశ - పల్లెసృజన కలలు




దేశవ్యాప్తంగా గ్రామీణ స్థాయిలో వెలుగులోకి వస్తున్న గ్రాస్‌రూట్ ఆవిష్కరణలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. రైతులు, గ్రామీణులు, చిన్న వ్యాపారులు తమ అనుభవం ఆధారంగా సృష్టిస్తున్న ఈ ఆవిష్కరణలు వ్యవసాయం, జీవనోపాధి మరియు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ఆవిష్కరణలను మరింత ప్రోత్సహించేందుకు 'పల్లెసృజన' సంస్థ కొన్ని ముఖ్యమైన సూచనలు మరియు సలహాలను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' మరియు ప్రధానమంత్రి కార్యాలయానికి ప్రతిపాదించింది.

**ప్రధాన సూచనలు:**

1. ప్రభుత్వంలోని అన్నిశాఖలు రూపొందించే పథకాలు, ప్రతిపాదనలు, కార్యక్రమాలు మరియు నిధుల కేటాయింపులో గ్రాన్ రూట్స్ ఆవిష్కరణలను ప్రత్యేక విభాగంగా పరిగణించేందుకు ఒక ప్రభుత్వ ఉత్తర్వు జారీ చెయ్యాలి.
2. నేషనల్ రీసెర్చ్ ఫండ్ (ఎన్ఆర్ఎఫ్) లో కూడా గ్రాస్‌రూట్స్ ఆవిష్కరణలకు ప్రత్యేక విభాగం కల్పించాలి.
3 గ్రామీణ ఆవిష్కరణలను అభివృద్ధి చేయడానికి "విశ్వవిద్యాలయాలు, విద్యార్థులు, జాతీయ మరియు ప్రాంతీయ ఆవిష్కరణ సంస్థలు, ఇంక్యుబేటర్లు, సిఎస్ఆర్ సంస్థలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ నిధులు" కలిసి పనిచేయాలి. ముఖ్యంగా యుబిఎ, ఎఐఎం, ఎన్ఐఎఫ్ వంటి జాతీయ సంస్థలతో పటు తెలంగాణ లోని టిజిఐసి, ఆంధ్ర ప్రదేశ్ లోని ఆర్‌టిఎఫ్ఐ వంటి రాష్ట్ర స్థాయి సంస్థల సహకారం అవసరం.
4. గ్రామీణ ఆవిష్కరణలకు "ఎన్ఐఎఫ్ అందించే సహాయాన్ని వికేంద్రీకరించి" మరింత అందుబాటులోకి తీసుకురావాలి.
5. దక్షిణ భారత రాష్ట్రాలకు ఉపయోగపడే విధంగా "ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో ఎన్ఐఎఫ్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి".
6. 'ఆరు నెలలకు ఒకసారి జాతీయ స్థాయిలో సమావేశం' నిర్వహించి, సహకార సంస్థల మధ్య పరస్పర నమ్మకం, సమన్వయం మరియు కార్యదక్షత పెంపొందించాలి. ఈ సమావేశాల ద్వారా విధానాలు, ప్రణాళికలు,నియంత్రణలపై తాజా సమాచారం పంచుకో వచ్చు.
7. కనీసం 100 గ్రాస్‌రూట్స్ ఆవిష్కరణలపై ప్రభావ అంచనా (ఇంపాక్ట్ అసెస్‌మెంట్) నిర్వహించి, అవి సామాజిక, ఆర్థిక, పర్యావరణ మరియు స్థిరమైన జీవన విధానాలకు ఎంతగా దోహద పడుతున్నాయో స్పష్టంగా చూపాలి.
8. గ్రామాల్లో తయారయ్యే ఆవిష్కరణలకు సమాజపు భాగస్వామ్యాన్ని పంచి, గ్రామాలే తమ సృజనాత్మకతకు యజమానులుగా ఉండేలా ప్రోత్సహించాలి.
9. పంటల వారీగా గ్రాస్‌రూట్స్ ఆవిష్కరణలను కలిపి ప్రత్యేక కిట్లు తయారు చెయ్యాలి. తద్వారా రైతుల ఖర్చులు తగ్గి బయటి వనరుల పై ఆధార పడటం తగ్గుతుంది. పల్లెసృజన అభివృద్ధి చేసిన 'మిర్చి కిట్' వంటి నమూనాలను పరిశీలించవచ్చు.
10. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు మరియు కొత్త ఆలోచనలను గుర్తించి నమోదు చేయడానికి కళాశాల విద్యార్థులకు ప్రత్యేక ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు రూపొందించాలి.
11. యువతలో గ్రామీణ సృజనాత్మకతపై అవగాహన పెంచేందుకు 'ఫెలోషిప్ కార్యక్రమాలు' నిరంతరం నిర్వహించాలి. దీంతో దేశ అభివృద్ధికి అవసరమైన సున్నిత మనస్తత్వం కలిగిన యువత (సంవేదన పొందే యువత) తయారవుతుంది.
12. ఎన్ఐఎఫ్ మరియు దాని భాగస్వామి సంస్థల డేటాబేస్‌లో ఉన్న అనేక గ్రాస్‌రూట్స్ విష్కరణలను ఎంఎస్ఎంఇ రంగానికి అందించి, వాటిని ఉత్పత్తులుగా తయారు చేసి, దేశ వ్యాప్తంగా ప్రజలకు చేరేలా చేయాలి. అవసరమైతే ప్రపంచ స్థాయిలో కూడా విస్తరించాలి.
13. గ్రామీణ ఆవిష్కర్తలు అభివృద్ధి చేసిన సంరక్షక పదార్థాలు, ఔషధాలు మరియు జీవ పురుగు మందులు, ఎన్ఐఎఫ్ ద్వారా ధృవీకరించబడిన తరువాత, వాటిని 'ప్రధానమంత్రి జన ఔషధి' వంటి కేంద్రాలలో అందుబాటులో ఉంచాలి. దీనికోసం ఎంఎస్ఎంఇ రంగం సహారం అవసరం.

ఈ సూచనలు అమలులోకి వస్తే, గ్రామీణ ప్రాంతాల్లో దాగివున్న సృజనాత్మకత వెలుగులోకి వచ్చి దేశ అభివృద్ధికి గొప్పగా దోహద పడుతుంది. గ్రాస్‌రూట్స్ ఆవిష్కరణలు 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయి. మీ సలహాలు, మార్గదర్శకత్వం మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం.

**- పల్లెసృజన బృందం.**

## పల్లెసృజన వాలంటీర్ 'మోహన్ వెంకట సాయి కృష్ణ సృష్టి

# వ్యవసాయ వ్యర్థాలను సులభంగా తిరిగి పొలంలో వాడుకునేట్టు గా చేసే 'ఈకో బర్నర్'

- వీరరాఘవ రెడ్డి



రైతులు ప్రత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, చెఱకు వంటి పైర్లను పండించిన తర్వాత వాటిని యంత్రాలతో లేదా మనుషులతో కోత కోయిస్తారు. కానీ భూమికి దాదాపు ఒక అడుగు ఎత్తులో ఆ పంట అవశేషాలు మిగిలి పోతాయి. తర్వాత పొలాన్ని దున్ని, వాటిని ఏరివేయ, ఒకచోట కుప్పగా పోసి తగలబెడుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల భూమితో పాటు, పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాన్ని దాదాపు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు ఎన్నిసార్లు చెప్పినా ఈ పని మానటం లేదు.

ఈ సమస్యకు ఒక పరిష్కారం కనుగొన్నాడు 'పల్లె సృజన' వాలంటీర్ 'మోహన్ వెంకట్ సాయి కృష్ణ'. అతను



చూసిన, రైతులు చేస్తున్న పని తమ పొలానికి నష్టం చేకూర్చటం తో పాటు పర్యావరణానికి కూడా హాని తలపెడుతుంది అని "ఈకో బర్నర్"ను రూపొందించాడు. దీన్ని రైతులు సులభంగా ఉపయోగించుకునే, తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారం.

రైతుప్రత్తి, కంది, జొన్న లాంటి వ్యవసాయ వ్యార్థాలను ఎటూ పొలం దున్నిన తర్వాత వాటిని ఏరించి, పొలంలో ఒకచోట కుప్పగా వేసి కాలుస్తాడు. కాబట్టి అలా ఏరిన వ్యర్థాలను 'ఈకో బర్నర్'లో వేసి అంటిస్తే చాలు....

- వాటిని ఆ యంత్రం కాల్చి "బయోచార్"గా మారుస్తుంది.
- సాధారణంగా పొలంలో అంటించిన దానికన్నా తక్కువ పొగ విడుదల చేస్తుంది.
- మోటార్ సైకిల్‌కు తగిలించుకుని పొలానికి తీసుకు వెళ్ళగలిగే చిన్న, పోర్టబుల్ డిజైన్.
- విద్యుత్ అవసరం లేదు.
- స్థానికంగా అందుబాటులో ఉన్న పదార్థాలతో వాటిని కాల్చివేయవచ్చు.
- స్థానికంగా కూడా తయారు చేసుకునే సరళమైన డిజైన్.
- దాదాపు 25% వరకు కాలుష్యం తగ్గిస్తుంది.
- 'బయోచార్' రైతుకు ఎరువుగా ఉపయోగ పడుతుంది.

**ఇన్నోవేటర్ మోహన్, ఫోన్ : 93988 26008.**

# జనవరి - ఏప్రిల్ 2026 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు



ఆంధ్ర ప్రదేశ్, బాపట్ల జిల్లా, పరుచూరు మండల కేంద్రం లోని 'అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపం'లో 1-2-2026 ఆదివారం నిర్వహించిన "ఉభయ రాష్ట్రాల ప్రకృతి సాగు రైతుల సదస్సు"లో ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం, కంభంపాడు గ్రామానికి చెందిన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ "నరాల రాజశేఖర్ రెడ్డి"ని 'గోపుత్ర ఉత్తమ రైతు పురస్కారం'తో సత్కరించారు.





హైదరాబాద్ లోని 'ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఫిబ్రవరి 8,9 తేదీలలో రెండు రోజుల పాటు "కిసాన్ మేళా" నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనలో 'ఏజీ హబ్' సంస్థ సహకారంతో 'పల్లెసృజన' 14 ఇన్నోవేషన్ల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రెండు రోజుల ప్రదర్శనలో దాదాపు 4 వేల మంది రైతులు ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రణాళికా సంఘం అధ్యక్షులు, శాసన సభ్యులు జిన్నారెడ్డి గారు 'పల్లెసృజన' ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమాన్ని సుభష్ చందర్ పల్లెసృజన తరుపున ప్రాతినిధ్యం వహించారు.










అనకాపల్లి జిల్లా తుని కేంద్రంలో 'శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ' వారు "సైన్స్ డే" సందర్భంగా ఫిబ్రవరి 27, 28 తేదీల్లో 'ఇన్నోవేషన్ల ప్రదర్శన' ఏర్పాటు చేశారు. ఇందులో 'పల్లెసృజన' దాదాపడు 30 ఇన్నోవేషన్లను ప్రదర్శించింది. 5 మంది ఇన్నోవేటర్లు కూడా పాల్గొన్నారు. కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థులు, 70 మంది అధ్యాపకులు ఈ ప్రదర్శనను తిలకించి, ఇన్నోవేటర్లతో మాట్లాడారు. రెండో రోజు కూడా మరో 500 మంది విద్యార్థులు, 40 మంది అధ్యాపకులు పాల్గొని ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో సుమారు 20 కళాశాలలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన పేపర్ ప్రజెంటేషన్‌కు 'పల్లెసృజన' సమన్వయకర్త సుభాష్ చందర్ జ్యూరీగా వ్యవహరించడం జరిగింది. ఈ సందర్భంగా సుభాష్‌ను, ఇన్నోవేటర్లు శ్యాంబాబు, బాబూరావు, పంపన శ్రీనివాస్, చిడిపి నాగభూషణం, తిరుమలశెట్టి శ్రీనివాస రావులను కళాశాల వ్యవస్థాపక ఛైర్మన్ సిహెచ్‌వికె నరసింహారావు, అధ్యక్షులు నరేంద్రబాబు తదితరులు సత్కరించారు.

# జనవరి - ఏప్రిల్ 2026 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు






26 జనవరి, 2026న భారత రాష్ట్రపతి శ్రీమతి ముర్ము గారు ఏర్పాటు చేసిన 'ఎట్ హెూం' కార్యక్రమంలో పాల్గొనేందుకు 'పల్లె సృజన' ఇన్నోవేటర్ షణ్ముఖరావు పాల్గొనేందుకు ఆహ్వానం అందటంతో అతను ఈ కార్యక్రమంలో పాల్గొనటం జరిగింది. రాష్ట్రపతి ముర్ము గారు ఇనోవేటర్లను స్వయంగా సత్కరించి, వారితో ఆప్యాయంగా మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు ఇన్నోవేటర్ 'షణ్ముఖరావు'. 'పల్లెసృజన' సగర్వంగా అయనను అభినందిస్తున్నది.







తెలంగాణ లోని భువనగిరి జిల్లా, బస్వాపూర్ లోని కెజిబివి పాఠశాల విద్యార్థులతో 'పల్లెసృజన' సమన్వయ కార్యక్రమాన్ని 23 మార్చి, 2026న 'ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్' వారి సహకారంతో ఏర్పాటు చేసిన "రోబోటిక్స్ ల్యాబ్ & గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్" ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రాధ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుభాష్ చందర్ పాల్గొన్నారు.



2 ఏప్రిల్, 2026న 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి, అక్కడి ఇన్నోవేషన్లను పరిశీలించి, వివరాలు కనుగొన్న యం.వి. ఫౌండేషన్ అధిపతి. చిత్రంలో వాలంటీర్ నాగమోహన్ మరియు పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం.




19 ఏప్రిల్, 2026న హైదరాబాద్‌లో జరిగిన 'టెడెక్స్' కార్యక్రమంలో 6 మంది "పల్లెసృజన" ఇన్నోవేటర్లు, ముగ్గురు వాలంటీర్లు సుభాష్ చందర్ ఆధ్వర్యంలో పాల్గొని ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్ లో 20 ఆవిష్కరణలను ప్రదర్శించారు.

# ఇన్నోవేటర్ 'కొడిముంజ ప్రవీణ్ కుమార్' సృష్టి
# గడ్డి, జొన్న, కంది కోతలు కోసే 'మల్టీ క్రాప్ హార్వెస్టర్'



- వీరరాఘవ రెడ్డి

థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లో 2026 జనవరి, 5 నుండి 9వ తేది వరకు జరిగిన IPITEx 2026 లో వ్యవసాయం, నీరు, పర్యావరణం మరియు గ్రామీణ జీవనోపాధులకు చెందిన పరిష్కారాలను చూపే ఇన్నోవేషన్ లను ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో మన పల్లెసృజన తరుపు న పాల్గొన్న గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ల లో మల్బరీ కొమ్మలను (చెట్లను) కోత కోసి, కట్టలు కట్టిచ్చే ట్రాక్టర్ అనుసంధాన పరికరం తయారు చేసినందుకు తెలంగాణ లోని సిరిసిల్ల జిల్లాకు చెందిన ఇన్నోవేటర్ 'కొడిముంజ ప్రవీణ్ కుమార్' అంతర్జాతీయ స్థాయిలో "బంగారు పతకం" పొందిన విషయం పల్లెసృజన పాఠకులకు గుర్తుండే ఉంటుంది.

ఇటీవల కర్నాటక రాష్ట్ర రైతుల కోరిక మేరకు ఆ యంత్రాన్ని రైతులకు ప్రదర్శించేందుకు వెళ్ళగా, అక్కడ ఒక రైతు కోరిన కోరిక ప్రవీణ్ ను ఆలోచింపజేసింది. ఆ రైతు కోరిన కోరిక ఏమిటంటే.... "మీరు చేసిన ఈ యంత్రం వల్ల పట్టు రైతులకు ఎంతో బలాన్ని చేకూర్చింది, మానేయాలి అనుకుంటు న్న తరుణంలో ఈ వ్యవసాయం పట్ల ఆశలు చిగురింప జేశారు బాగుంది. కానీ, ఈ ట్రాక్టర్ అనుసంధాన యంత్రం నా లాంటి చిన్నకారు రైతులకు ఉపయోగ పడదు. ఎందుకంటే ఇంత ఖరీదు పెట్టి మేము కొనలేము, ట్రాక్టర్ కిరాయికి తీసుకుని చేసుకుందాము అనుకుంటే మావి చిన్న చిన్న మడులలో పంట వేస్తాము కాబట్టి అక్కడ ట్రాక్టర్ పని చెయ్యడం కష్టం. మాకున్నదే ఒకటి రెండు ఎకరాలు అందులో ఈ ట్రాక్టర్ తిరిగితే వృధా ఎక్కువ అవుతుంది". అన్నారు.

అదే యంత్రాన్ని చూసిన కొందరు 'డైరీ ఫాం' (పాల ఉత్పత్తిదారులు) "మాకు పశువులకు మేత కొరకు వేసే 'నేపియర్ గడ్డి' కోయాలంటే కూలీల లేమి వల్ల చాలా కష్టంగా ఉంది, మీరు మల్బరీని కత్తిరించే యంత్రం లాంటిది, ట్రాక్టర్ అవసరం లేని ఒక చిన్న యంత్రాన్ని తయారు చేసే ఆలోచన చెయ్యండి" అని అడిగారు. ఈ గడ్డిని కత్తిరించేందుకు పెద్ద పెద్ద యంత్రాలు ఉన్నాయి కానీ, అవి 10-15 లక్షల దాకా ఉన్నాయి. అంత పెద్ద యంత్రాలను సామాన్య రైతులు కొనుగోలు చెయ్యలేరు, కిరాయికి తీసుకోవాలంటే కుదరదు. ఎందుకంటే గడ్డిని ప్రతిరోజూ కోసి పశువులకు వెయ్యాల్సి ఉంటుంది. కాబట్టి కిరాయికి యంత్రాన్ని తీసుకోవడం కుదరదు. మీరు ఇప్పుడు చేసిన ఈ యంత్రం లాగే మాకు



కోసి, వెనక్కు తీసుకు వెళ్ళి స్టోరేజి ప్రాంతంలో నిలువ చేసే యంత్ర భాగాలను పరిశీలించండి

కూడా ఒకటిన్నర – రెండు లక్షల లో కొనుగోలు చేసేందుకు అనుకూలమైన యంత్రం తయారు చేసి ఇవ్వటానికి ఆలోచన చెయ్యండి" అని కోరటం జరిగింది.

ఈ యంత్రం అవసరం పైన చెప్పిన ఇద్దరికే కాదు, ప్రత్తి, కంది, జొన్న (సొప్ప), మొక్కజొన్న కోసే రైతులకు కూడా చాలా అవసరం కదా దీనికి పరిష్కారం కనుగొనాలి అని ఆలోచించాడు ప్రవీణ్. గతంలో తాను తయారు చేసిన 'పవర్ వీడర్'కు ఇలాంటి యంత్రాన్ని తయారు చెయ్యాలని ఆలోచించాడు. అలాగే ట్రాక్టర్ అవసరం లేకుండా, రైతుకు పెట్రోలు ఖర్చు కూడా లేకుండా బ్యాటరీతో నడిచే యంత్రాన్ని తయారు చేసినట్లయితే అందరు రైతుల కోరిక నెరవేరుతుంది, వారు కోరుకున్న ధరకే లభించే అవకాశం ఉంటుందని అనుకున్నాడు ప్రవీణ్.

ఇలా ఆలోచించి మొత్తానికి ఒక యంత్రాన్ని తయారు చేశాడు. కానీ, అందులో కొన్ని లోటుపాట్లు ఉన్నట్లు తానే గ్రహించి, ఆ యంత్రానికి ఎన్నో మార్పులు చేర్పులు చేశాడు. అయినా అతనికి నచ్చలేదు. ఇలా ఇంజన్ సహాయంతో నడిచే యంత్రం తయారు చేయటం వల్ల రైతుకు చాలా కష్టం, భారంగా కూడా ఉంటుంది. రైతు ప్రతి దానికి రిపేర్లు చేసుకుంటూ ఉండాలంటే కుదరని పని అని ఆలోచించాడు.

ఇటీవల ఎన్ఐఎఫ్ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్ళినపుడు ఆ కార్యక్రమం అయిపోయిన తర్వాత మరో రోజు అక్కడే ఉండి తాను ఆలోచిస్తున్న ఈ యంత్రానికి ఎలాంటి మోటారు అయితే బావుంటుంది అని ఢిల్లీలోని కరోల్‌బాగ్ ప్రాంతంలో కొన్ని మోటార్లను, వాటి పని తీరును పరిశీలించి, తనకు అవసరమైన, ఇదైతే బాగుంటుంది అని ఆలోచించి, రెండు మోటార్లను తెచ్చుకుని పని మొదలు పెట్టాడు.

ఇప్పుడు తయారు చేసిన ఈ యంత్రం ఛార్జింగ్ తో నడిచే డిసి మోటార్ సహాయంతో పని చేస్తుంది. ఈ యంత్రంలో మల్బరీ కోసే యంత్రం లాగా కోత కోసిన వాటిని కట్టలు కట్టి ఇవ్వదు. ఎందుకంటే ఈ యంత్రానికి మళ్ళీ కట్టలు కట్టేలా చెయ్యాలంటే మళ్ళీ ఖర్చు ఎక్కువ అవుతుంది. కాబట్టి ఆ యంత్రం లోనే కోత కోసిన మొక్కలను నిలువ చేసుకునేందుకు



కోత తర్వాత రైతు స్టోరేజి నిండిన తర్వాత పంటను సేకరిస్తున్న దృశ్యాలు



ఒక ఏర్పాటు చేశాడు. ఈ 'మల్టీ క్రాప్ హార్వెస్టర్' యంత్రం నేపియర్ గడ్డి, మల్బరీ, జొన్న, మొక్కజొన్న లాంటి పంటలను కత్తిరించి, యంత్రం వెనకాల ఏర్పాటు చేసిన నిలువ చేసుకునే స్థలంలో ఉంచుకుంటుంది. ఆ స్థలం (స్టోరేజ్) నిండిన తర్వాత వాటిని రైతు తీసి పక్కన వేసుకోవాలి. యంత్రాన్ని సాలు వెంట నడుపుకుంటూ వెళ్తే చాలు పంటను కోసి, స్టోరేజిలో వేసుకుంటూ వెళుతుంది. రైతు చేయాల్సిన పని కేవలం యంత్రం యొక్క 'యాక్సలేటర్'ను ఒత్తుకుంటూ వెళ్తే చాలు. పంటను యంత్రం కత్తిరించుకుంటూ వెళ్తుంది.

ఆ విధంగా తయారైన యంత్రాన్ని రైతులకు చూపించగా, ఇది చాలు మాకు అని తమ సమ్మతిని తెలియజేశారు. సరే ఇందులో వున్న లోపాలను కూడా సరిచేసి, సరైన మోటారు, ఇతర భాగాలు తెచ్చుకుని దీన్ని పూర్తి స్థాయిలో తయారు చెయ్యాలంటే ఎవరైనా రైతులు ముందుకు వచ్చి, యంత్రం తయారీ కొరకు ఒక లక్ష రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చినట్లయితే ఒక వారం – పది రోజుల్లో యంత్రం తయారు చేసి ఇస్తాను అన్నాడు. అందుకు సమ్మతించిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన 'మునిరాజు' అనే రైతు బయానాగా లక్ష రూపాయలు ఇవ్వటం జరిగింది. ఇప్పుడు ఈ యంత్రం పరిపూర్ణంగా చిన్న, సన్నకారు రైతులకు అన్ని రకాల పంటలను కోత కోసేందుకు సిద్ధమైంది.

ఈ యంత్రాన్ని రైతు నడుపుకుంటూ పంట సాలు వెంట వెళుతూ ఉంటే, అది పంటను కోత కోసి, స్టోరేజి లోకి నెట్టుకుంటూ వెళుతుంది. వెనకాల ఒక వ్యక్తి ఆ సోరేజి నిండిన వెంటనే దాన్ని తీసి, ఒకచోట కుప్పగా వేసుకుంటూ వెళ్తాడు. ఆ తర్వాత కోత కోసిన పంటను కట్టలు కట్టుకోవడం లేదా నేరుగా బండి పైన వేసుకుని కావలసిన చోటికి దాన్ని చేర్చడం జరుగుతుంది.

ప్రవీణ్ తయారు చేసిన ఈ యంత్రం వల్ల చిన్నకారు మల్బరీ రైతులకు, పాల ఉత్పత్తి దారులకు, కంది, జొన్న, మొక్కజొన్న పంటలు వేసే రైతులకు ఎంతో శ్రమను, ఖర్చును మిగల్చటంతో పాటు, ఎంతో సమయాన్ని ఆదా చేసేదిగా ఈ యంత్రం తయారు అయ్యింది.

ఈ యంత్రం ఇప్పుడు 2 లక్షల రూపాయలకు అందజేయటానికి ఇన్నోవేటర్ ప్రవీణ్ సిద్ధంగా ఉన్నాడు. కావలసిన రైతులు అడ్వాన్స్ ఇచ్చిన వారం – పది రోజుల్లో 'కోత యంత్రం' తయారు చేసి ఇస్తాడు.

అవసరమున్న రైతులందరూ ఈ యంత్రాన్ని వినియోగించుకుని తమ సమయాన్ని, ఖర్చును, శ్రమను ఆదా చేసుకోవాలని తెలియజేస్తోంది 'పల్లెసృజన'. మల్బరీ చెట్లను కత్తిరించే యంత్రంతో ప్రపంచ స్థాయి ఖ్యాతిని ఆర్జించిన ప్రవీణ్ మరో చిన్న యంత్రాన్ని తయారు చేసి, సన్న చిన్నకారు రైతులకు ఊరటనిచ్చినందుకు ప్రవీణ్ కుమార్‌ను మనసారా అభినందిస్తోంది "పల్లెసృజన". ఈ యంత్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు సహకరిస్తోంది పల్లెసృజన.

మనకు చేతనైంది కాదు, రైతులకు కావలసింది ఇవ్వటమే ధ్యేయంగా,సమాజ అభివృద్ధికై స్వచ్ఛందంగా పాటుపడుతున్న ప్రవీణ్ కుమార్ లాంటి గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు జోహార్లు. ఇలాంటి వారికి తోడ్పాటు అందించే అవకాశం లభించినందుకు 'పల్లెసృజన' ధన్యమైంది.

**ఇన్నోవేటర్ ప్రవీణ్ కుమార్, ఫోన్ : 88863 81657**

# 'మేము త్రవ్వుతాము, ఎండబెడతాము, కలలు కంటాము'

## బీహార్ రాష్ట్రం లోని 'కటిహార్' ప్రాంతంలో 'సృష్టి' ఆధ్వర్యంలో 52వ శోధయాత్ర



### ప్రకృతి ఒడిలో జ్ఞానం, జీవన విధానం కలబోత 'కటిహార్':

ఉత్తర బీహార్ పరీవాహక ప్రాంతంలో ఉన్న కటిహార్ జిల్లా సహజ సంపదలతో నిండిన నేల. సాల్, టేకు, మామిడి తోటలు, స్థానిక గడ్డి రకాలు ఈ ప్రాంతానికి ప్రత్యేకత సమకూర్చాయి. ఇవి పక్షులు, జంతువులకు ఆశ్రయం కల్పిస్తూ ఒక సమగ్ర జీవ వైవిద్యాన్ని నిలబెడుతున్నాయి.

యాత్రీకులు పొలాల గుండా ప్రయాణిస్తూ లాఫా సాగ్, అడవి పసుపు, సర్కండా గడ్డి వంటి మొక్కలను గమనించారు. ఈ సందర్భంలో "మేము తినడానికి మాత్రమే కాదు.... ఆరోగ్యం కోసం, సంబరాల కోసం, జ్ఞాపకాల కోసం కూడా పండిస్తాము" అని ఒక పెద్ద మనిషి చెప్పిన మాట ఈ నేల ఆత్మను ప్రతిబింబించింది.

### గ్రామీణ పట్టుదల - ఆవిష్కరణల స్ఫూర్తి:

కటిహార్‌లో జరిగిన 52వ శోధయాత్ర ఒక సాధారణ యాత్ర కాదు. ఇది గ్రామీణ ఆవిష్కరణల జాడను అన్వేషించే జ్ఞాన యాత్ర.

మామిడి రైతు కాలీదాస్ బెనర్జీ తన తోటలో 450కి పైగా చెట్లు పెంచి, వాటికి జాతీయ నాయకుల పేర్లు పెట్టడం విశేషం. "చిత్తరంజన్" అనే మామిడి రకం గాలివానలకు కూడా పడిపోని గుణంతో ప్రసిద్ధి చెందింది.

ఇక ప్రీతి కుమారి తన పొలాన్ని 'పుట్టగొడుగుల' సాగుగా మార్చి పాపడ్లు, పచ్చళ్ళు, హల్వా వంటి ఉత్పత్తులతో విజయవంతమైన వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకుంది. 16 మహిళా సంఘాలకు ఉపాధి కల్పించి, సంవత్సరానికి రూ. 3.5 లక్షలదాకా ఆదాయం పొందింది.









**మన కాళ్లక్రిందనే ఉన్న ఔషధ జ్ఞానం:**

ఈ యాత్రలో ముఖ్యంగా కనిపించిన విషయం – గ్రామీణ ప్రజల వద్ద ఉన్న సంప్రదాయ వైద్య జ్ఞానం.

పూనమ్ దేవి ప్రసవానంతర ఆరోగ్యానికి 'శతావరి' మొక్క వేర్లతో టానిక్ తయారు చేస్తుంది. మహాదేశ్ ప్రసాద్ 'నేల ఉసిరి' తో పచ్చకామెర్ల వ్యాధికి చికిత్స చేస్తాడు. ఉర్మిళ కుమారి అనే మహిళ 'చూయిమాయి' అనే మొక్కను విష సర్పాల కాటుకు వైద్యంగా ఉపయోగిస్తుంది.

ఇంకా అనేక చికిత్సలు – పశువుల గాయాలకు ఆకులు, యూరిక్ ఆమ్లానికి జ్యూట్ టీ, మహిళల సమస్యలకు పుష్పాలు, మానసిక నియంత్రణకు మూలికలు..... ఇలా అనేక రకాల జ్ఞానం గ్రామాల్లో జీవంగా ఉంది.

అయితే ఈ జ్ఞానం చాలావరకు నమోదు కాలేదు. వృద్ధుల వద్ద మాత్రమే ఉండటం వల్ల ఇది క్రమంగా అంతరించి పోయే ప్రమాదం పొంచివుంది.

**సంస్కృతి, సృజనాత్మకత – కళలో జీవన సౌందర్యం:**

కటిహార్ ప్రాంతంలో ఖత్వా, కాంతా వంటి ప్యాచ్ వర్క్ కళలు విస్తృతంగా ఉన్నాయి. పాత బట్టలతో తయారైన దుప్పట్లు ప్రకృతి, జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి.

చేతితో నేసిన బెడ్‌షీట్లు, గడ్డితో తయారైన మ్యాట్లు యాత్రీకులను బాగా ఆకట్టుకున్నాయి. అయితే కళాకారుల కష్టానికి సరైన ఫలం (ధర) లభించకపోవడం ఒక పెద్ద సమస్యగా కనిపించింది.

డిమాండ్ పెరిగినప్పుడు ధర పెంచినప్పటికీ, మార్కెట్ ఆమోదం లేకపోవడం, గ్రామీణ ఉత్పత్తుల విలువ – వ్యవస్థను ప్రశ్నిస్తుంది.

**పర్యావరణానికి అనుకూలమైన జీవన విధానం:**

కటిహార్‌లో ఇళ్ల నిర్మాణంలో సహజ పదార్థాల వినియోగం విస్తృతంగా కనిపించింది. గడ్డి పైకప్పులు, వెదురు బొంగుల గోడలు వాతావరణానికి అనుకూలంగా ఉంటాయి.

ఆవు పేడతో తయారు చేసిన ఇంధనం వంటి పద్ధతులు సాంప్రదాయ జ్ఞానం మరియు పర్యావరణ స్నేహ పూర్వకతను ప్రతిబింబిస్తుంటాయి.

**పుట్టగొడుగుల పెంపకం – రైతు కష్టం, మార్కెట్ వాస్తవం:**

పుట్టగొడుగుల పంటలో కటిహార్ ప్రముఖ స్థానం కలిగి ఉంది. కానీ రైతులకు తగిన గిట్టుబాటు ధర అందడం లేదు.

ఉషాదేవి వంటి రైతులు కిలోకు రూ. 100/– మాత్రం







సంపాదిస్తుంటే, పట్టణాల్లో అదే ఉత్పత్తి రూ. 1,500/–కి అమ్మబడుతోంది.

అయితే కొన్ని మహిళా సమూహాలు ఈ రంగంలో విజయాన్ని సాధించి, లక్షల రూపాయల ఆదాయం పొందు తున్నాయి.

**పిల్లలలో దాగివున్న భవిష్యత్:**

ఈ యాత్రలో పిల్లలు అత్యంత ప్రేరణాత్మకంగా నిలిచారు. "మేము త్రవ్వుతాము.... ఎండబెడతాము... కలలు కంటాము" అని ఒక చిన్నారి చెప్పిన మాట ఈ యాత్రయొక్క సారాంశాన్ని చెబుతుంది.





కల్నల్ ఉదయ్ వర్మ వంటి వ్యక్తులు పిల్లలకు విద్య, అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు.

**ముగింపు - నేర్చుకోవాల్సిన గ్రామీణ భారతం:**

"మనము వినడానికి సిద్ధంగా ఉంటే ప్రతి అడుగు జ్ఞానానికి దారి తీస్తుంది". కటిహార్ శోధయాత్ర మనకు ఒక గొప్ప పాఠం నేర్పింది – జ్ఞానం పుస్తకాల్లో మాత్రమే కాదు; అది రైతు చేతిలో, కళాకారుడి నూలులో, పిల్లల కలల్లో ఉంటుంది. గ్రామీణ భారత దేశాన్ని మార్చడం కాదు, దాని నుంచి నేర్చుకోవడమే మన అసలు అభివృద్ధి.

**ఆంధ్రప్రదేశ్ లోని 'నంద్యాల' జిల్లాలో జరిగిన 56వ "చిన్న శోధయాత్ర" దృశ్యాలు**



## ఆంధ్రప్రదేశ్ లోని 'నంద్యాల' జిల్లాలో జరిగిన 56వ చిన్న శోధయాత్ర దృశ్యాలు
















# DR. A.P.J. ABDUL KALAM IGNITE AWARDS

# డా. ఎపిజె అబ్దుల్ కలాం 'చిన్న పిల్లల సృజనాత్మక మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు



NATIONAL INNOVATION FOUNDATION (NIF)
DEPARTMENT OF SCIENCE AND TECHNOLOGY,
GOVERNMENT OF INDIA.

- 'హనీబీ' పత్రిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

డా. ఎపిజె అబ్దుల్ కలామ్ గారి పేరిట ప్రతి సంవత్సరం **12**వ తరగతి పిల్లల వరకు మరియు ఏమీ చదువుకోకపోయినా, చదువు ఆపేసిన **19** సంవత్సరాల పిల్లల నుండి వారి సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్‌లకై దరఖాస్తులు స్వీకరించ బడతాయి. ఈ పురస్కారాలు చిన్న పిల్లలలో ఇతరుల కష్టాల గురించి సంవేదన పడటం, స్థానిక ప్రజల సమస్యలకి పరిష్కారాలు కనుగొనటం, తద్వారా సామాజిక అవసరాలను తీర్చటం దృష్టిలో పెట్టుకొని నిర్వహించ బడతాయి.

ఈ పోటీ కేవలం ఉపన్యాసాలు వినటం కొరకు మాత్రమే కాదు, చిన్న పిల్లలకి చాలా మంచి ఆలోచనలు వస్తాయి అన్న తత్వంపై ఆధారపడి ఉంది. ఇటువంటి చురుకైన ఆలోచనలు చేసే పిల్లలను గుర్తించి సమాజానికి పనికి వచ్చే వారి ఆలోచనలను సేకరించి, వారికి తగిన గుర్తింపు, పురస్కారాలు అందజెయ్యటానికి 'గ్యాన్, శ్రిష్టి, హనీబీ నెట్‌వర్క్ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తునే ఉంటుంది. **2023**వ సంవత్సరానికి గాను "ఇగ్నైట్" పేరిట జరిగిన పోటీలలో గెలుపొందిన చిన్న పిల్లల ఆలోచనలు, ఆవిష్కారాల వివరాలలో కొన్ని మీ ముందుంచుతున్నాము.

### అంధులకై బ్లూటూత్ ఏర్పాటుతో ప్రత్యేక కళ్ళద్దాలు:

**రీనా దిల్‌కర్,** 10వ తరగతి, ది గార్డియన్ & గైడ్ పబ్లిక్ స్కూల్, ఛత్తీస్‌ఘడ్.

కళ్ళు కనిపించని వారు ఒ ప్రదేశం నుండి ఇంకొక ప్రదేశానికి వెళ్ళటానికి ఉపయోగ పడేదే ఈ ఆలోచన. దీనిలో మార్గదర్శకత్వం చేయటానికి బ్లూటూత్ మరియు ఆగటానికి సెన్సార్ అమర్చి ఉంటాయి.



ఆ అంధులకు ఆటంకాలను పసిగట్టడం, తోవ చూపించటం, ఆ వివరాలను వాటిని ధరించిన వ్యక్తికి మాటల ద్వారా వినిపించేటట్లు చేస్తాయి. ఆధునిక సెన్సార్‌లు, బ్లూటూత్ సదుపాయం ఏకీకృతం



చెయ్యటం వలన వ్యక్తి ముందున్న ఆటంకాలు, ప్రమాదాలు కనిపెట్టి, వెంటవెంటనే ప్రయాణ ససహాయక సూచనలు చేస్తుంది. అంధులను ఎటువైపు చూస్తే అటువైపు వున్న వివరాలను ధరించిన వ్యక్తికి మాటల ద్వారా తెలియజేస్తుంది. దీనితో అంధులు సునాయాసంగా ఎవ్వరి సహాయం లేకుండా తమ ప్రయాణాలు కొనసాగించి, గమ్యాన్ని చేరుకోవచ్చు.



## హైటెక్, ద్విచక్ర వాహనాల కూలింగ్ సిస్టమ్‌తో పాటు ఇతర రక్షణ సదుపాయాలు:

**సుఫియాన్ మహమ్మద్ హనీఫ్ పటేల్,** 8వ తరగతి, తపతి పబ్లిక్ స్కూల్, జల్‌గావ్, మహారాష్ట్ర.



ద్విచక్ర వాహనాలపై చాలా వేడిలో లేదా చాలా దూరం ప్రయాణం చేసే వారికి బాగా పనికి వచ్చేదే ఈ పద్ధతి. అధునాతనమైన ఈ పద్ధతిలో ద్విచక్ర వాహనాలపై వెడుతున్న వారికి అవసరాను సారం చల్లగా లేదా వేడిగా హాయిని కలిగించే పరికరం. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి ధరించిన కోటులో అమర్చి చల్లగాలికి కండెన్సర్ మోటార్‌ని ఇంజన్‌కి అనుసంధానం చేస్తే ఆ కండెన్సర్‌లోనికి మనఎయిర్ కండిషన్‌లా పనిచేసి చల్లని గాలి కోటులోనికి ప్రసరించి, అది ధరించిన వ్యక్తికి ఎయిర్ కండిషన్‌లో ప్రయాణం చేస్తున్నట్లు అనిపిస్తుంది. బాగా వేడి ఉన్న ప్రదేశాలలో ప్రయాణించే వారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

దీనితో పాటు సైడ్ స్టాండ్ తీసి ఉండకపోతే అలారం పద్ధతి ఫోన్ ద్వారా వహనాన్ని స్టార్ట్ చేయటానికి అవకాశం లేకుండా ఉండే అనేక రక్షణ సదుపాయాలు కూడా ఉన్నాయి.



## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం



దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

<u>'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :</u>

77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.

ఫోన్ : 040-49253096, సెల్ : 96528 01700.

# పల్లె జ్ఞానం

- 'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

30202

**గొర్రెలకి, మేకలకి ప్రకృతి వైద్యం**

37 సంవత్సరాల కతిరేశన్ (మేలస్థానం గ్రామం, పుదుకుట్టై జిల్లా, తమిళనాడు) తన జీవనోపాధిగా గొర్రెలని పెంచుతుంటాడు. ఈ క్రమంలోనే అతను గొర్రెలు, మేకలకి సంబంధించిన అనేక రోగాలకి ప్రకృతి సిద్ధమైన మూలికా వైద్య చిట్కాలు, స్థానిక గితారీ జాతి వారివద్దనుండి, తన తండ్రి వద్దనుండి నేర్చుకొని తన స్వంత గొర్రెలు, మేకలకే కాక, ఆ ప్రాంతంలోని అనేక మందికి చెందిన జీవాలకి వైద్యం చేస్తున్నాడు.


**విరోచనాలు (గొర్రెలు, మేకలకి):**

అ) రైతులు ఎంతో భయంతో చూసే కుస్కుటా తీగ, లేదా బంగారు తీగగా పిలిచే పరాన్నభుక్కు తీగ (దీని నివారణకి తీగల చెట్టుతో తప్ప వేరే మార్గం లేదని చెపుతారు)ని ముద్దగా నూరి వ్యాధి సోకిన జీవాలకి తినిపిస్తూ మంచి గుణం కనిపిస్తుందట.

ఆ) చల్లని మజ్జిగలో పసుపు కలిపి దాహం తీర్చటానికని గొర్రెలకి మేకలకి తాగిస్తే, విరోచనాలు కడతాయంటాడితను.

ఇ) పచ్చి కొబ్బరి బోండంలో ఉండే పువ్వు, మొగ్గని మెత్తగా నూరి, 100 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి నీళ్ళ బదులు విరోచనాలు తగ్గేవరకు తాగించాలని చెపుతున్నాడీయన.





30205

**విరిగిన పశువుల ఎముకలకు మూలికా వైద్యం**

తమిళనాడులో ఒక మారుమూల పల్లెలో 68 సంవత్సరాల 'నాకూరన్' కి 5 ఎకరాల భూమి ఉంది. జీవనోపాధి కోసం అతను గొర్రెలను , పాడి ఆవులను పెంచుతుంటాడు. ఈయన తనంతట తానే పరిశోధనలు చేసి పశువులకి సంబంధించిన అనేక మూలికా వైద్య చిట్కాలు కనుగొన్నాడు. పశువులకి ఎముకలు విరిగినప్పుడు విరిగిన ప్రదేశంలో ముందుగా ఆముదం రాయాలి, ఆ తరువాత మెంతులు, పంచదార కలిపి మెత్తగా నూరి ఆ మిశ్రమానికి పెరుగు జోడించి, ఎముక విరిగినచోట పూయాలి. వెదురు బద్దలు తీసుకొని విరిగినచోట కట్టు కట్టి ఆ కట్టుపైన మినప పిండి, కోడిగుడ్డు లోని తెల్లసొన కలిపి ఆ కట్టుపైన పూతలా పట్టించాలి. రెండు వారాల తరువాత 50 గ్రా. మిరియాలు, 50 గ్రా. కావి, 50 గ్రా. పంచదార, కొంత తంగచెట్టు బెరడు, కలబంద కలిపి మెత్తగా నూరి ఒక లీటరు నువ్వుల నూనెలో మరిగించి తయారు చేసుకొన్న తైలాన్ని కట్టు తీసేసి దెబ్బ తగిలిన భాగంలో కొద్ది రోజులు పూయాలి. ఈవిధంగా చేస్తే పశువుల విరిగిన ఎముకలు చక్కగా అతుక్కుని మామూలుగా అవుతాయి అంటున్నాడీయన.

**పశువులలో అజీర్తి చేసినప్పుడు ....**

పశువులకి అజీర్తి చేసినప్పుడు ఇతడు తానే తయారు చేసుకొన్న ఒక మిశ్రమం యిచ్చి వైద్యం చేస్తుంటాడు. ఆ మిశ్రమంలో 50 గ్రా. అల్లం, రెండు మిరప కాయలు, 10 వెల్లుల్లి రెబ్బలు, 10 గ్రా. వాము, 5 తమలపాకులు,, 50 గ్రా. పసుపు తీసుకొని వీటన్నిటినీ మెత్తగా నూరి, అజీర్తితో బాధపడుతున్న పశువుకి తినిపిస్తే మంచి గుణం కనిపిస్తుందంటాడీయన.

30206

**పశువులలో వచ్చే కొన్ని జబ్బులకు చిట్కాలు**

తమిళనాడులోని పుదుక్కోట్టై జిల్లాకు చెందిన వీరమ్మన్ వ్యవసాయ కూలీగా పని చేస్తూనే ఆవులు, గొర్రెలని పెంచుతుంటుంది. ఆమె తను ఇతరుల నుంచి తెలుసుకున్నది, తన స్వంత అనుభవంతో

తెలుసుకున్న వాటితో పశువులకి, మనుషులకి కూడా మూలికా వైద్యం చేస్తుంటుంది.

**పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ....**

పశువులలో గాలికుంటు వ్యాధి (ఫుట్ & మౌత్ –ఎఫ్ఎండి) వచ్చినపుడు రెండు అరటి పళ్ళని నువ్వుల నూనెలో ముంచి పశువుచేత తినిపిస్తే మంచి గుణం ఉంటుంది అంటుందామె. అదే గొర్రెలకైతే ఒక్క అరటి పండు చాలట. ఇంకొక పద్ధతి కూడా చెపుతుందామె. చెరువులోనుంచి చిన్న చిన్న చేప పిల్లలని తెచ్చిచ వాటిని చితక్కొట్టి ఆ ముద్దని కొద్ది నీటిలో 3 రోజులు మురగబెట్టి వడగట్టిన నీటిని పశువుచేత తాగించినట్లయితే ఎఫ్.ఎం.డి. తగ్గిపోతుందంటుందామె.



**చిన్న పిల్లలకి జలుబు చేస్తే....**

చిన్న పిల్లలకి జలుబు చేస్తే ఈమె కొన్ని ముళ్ళ వంకాయలు, కొన్ని వరి లాకలు, కొన్ని తుమ్మ ఆకులు, కొన్ని తులసి ఆకులు తీసుకొని నీటిలో మరిగించి, ఆ కషాయాన్ని 50 మి.లీ. వేపనూనెలో కలిపి రెండు చెంచాలు పిల్లలకి తాగిస్తే జలుబు నయమయిపోతుందంటుందామె.

**పశువులలో జ్వరం, నెమరు వెయ్యకపోవటం.....**

పశువులకి జ్వరం వచ్చినా, లేదా నెమరు వెయ్యకపోయినా వేపగింజలు, కొబ్బరి పీచు నిప్పులపై వేసి ఆ పొగని పశువు ముఖం, శరీరం, వెనకవైపున పట్టిస్తే గుణం కనిపిస్తుందట.

**పశువులలో కడుపుబ్బరానికి చికిత్స......**

పశువులకి కడుపుబ్బరం చేస్తే 10 గ్రా. వాము, 4 తమలపాకులు, 3 వెల్లుల్లిపాయలు, గుప్పెడు మునగాకులు బాగా నూరి, ఆ ముద్దను తినిపించి పశువుకు ఉపశమం కలిగించ వచ్చని ఆమె చెప్పింది.

**పశువుల కడుపులో నులి పురుగులు పడితే చికిత్స....**

పశువుల కడుపులో నులిపురుగులు పడి పశువులు చాలా బాధపడుతుంటాయి. అటువంటి సమయంలో ఎండిన పొగాకుని వేప నూనెలో నానబెట్టి దాన్ని దూది మధ్య ఉంచి తినిపించాలి.

**కీటకాలు కుట్టినప్పుడు చికిత్స.....**

విష కీటకాలు, పాములు, తేల్లు కుట్టినప్పుడు ఎర్రని దద్దులు వచ్చి మంట పుడుతుంటుంది. అటువంటి సందర్భాల్లో నేల గొలిమిడి లేదా నేల గరగర ఆకు చూర్ణాన్ని చల్లని నీటిలో పరగడుపున తిగితే మంచి ఫలితం ఉంటుంది.

**పశువులలో విరోచనాలకు చికిత్స....**

పశువులు విరోచనాలతో బాధపడుతున్నప్పుడు కిస్కూటా లేదా బంగారుతీగ అనే పరాన్న బుక్కును తీసుకొని దీనిని బాగా దంచి ఆ ముద్దని మూడు రోజులు తినిపిస్తే విరోచనాల బాధనుంచి పశువులకి విముక్తి లభిస్తుంది అంటుందామె.

30214

**వంగ పంటలో పూత రాలపోవటానికి మందు...**

రాజస్థాన్, దుంగర్‌పూర్ గ్రామానికి చెందిన కతరా బాచూ భాయ్ కొంరీ భాయ్ వంగ పంటలో మొక్కలు పూతకి వచ్చి రాలిపోతుంటే నివారించటానికి ఒక చక్కటి చిట్కా చెబుతున్నాడు. పూత రాలిపోయే వంగపంటలో జిల్లేడు ఆకు పొడిని మధ్యాహ్నంపూట 3 రోజులకోసారి 2 లేదా 3సార్లు పొలంలో చల్లితే మంచి ఫలితం వుంటుందని చెబుతున్నాడు. జిల్లేడు ఆకులనుండి తయారు చేసిన రసం లద్దె పురుగు నివారణకి కూడా బాగా పని చేస్తుందట. అంతేకాక ఆకురసం పీల్చే పురుగుల నివారణకు కూడా సహాయకారిగా ఉంటుందట.

**తక్కెళ్ల ఆకుతో పశువులకు మనుషులకు వైద్యం...**

ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా, నకిరేకల్ మండలం దూపెగుంట్లకు చెందిన తొండపి గురవయ్య అనే 80 సంవత్సరాల రైతు ఇన్నోవేటర్ పూర్వం తన అమ్మమ్మ గారు చెప్పిన పశువులకు మరియు మనుషులకు ఆరోగ్యంగా వుండేందుకు ఉపయోగించిన ఒక చిట్కాను తెలియజేస్తున్నారు.

వీరికి 'తక్కెల చేను' అనే పొలం వున్నదని, ఆ పొలం గట్లవెంబడి 'తక్కెల్ల చెట్లు' వుంటాయట. వీరి అమ్మమ్మ గారు ఆ ఆకును తెచ్చి పశువుల పేడతో చేసిన కళ్ళాపిలో కలిపి ఇంటిముందు చల్లేదట. ఇలా చేయటం వల్ల పశువులకు గోమారి, కోడి గోమారి, పిరుదులు లాంటి ఏ క్రిములైనా సరే చనిపోయేవట. కోళ్ళకు, గొర్రెలకు ఇతర పశువులకు కూడా ఎలాంటి జబ్బులూ వుండేవి కాదట. ఇంట్లో పిల్లలకు, పెద్దలకు ఎవరికైనా జ్వరాలు వస్తే వెంట నే తక్కెల్ల ఆకు, పూత, పండ్లతో సహా తెప్పించి, వాటిని మెత్తగా నూరి కళ్ళాపి లో కలిపి ఇంటిముందు చల్లేదట. 'కరోనా' రోగాల బారిన పడకుండా ఆ ప్రయోగం చేస్తే బావుంటుందని తాను కూడా ఇప్పుడు చేస్తున్నాడట. ఫలితాలు ఆశాజనకంగా వున్నాయని తెలియ జేస్తున్నారు గురవయ్య గారు.



# పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్

## 2వ ఇన్నోవేషన్ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ



- 'హనీబీ' ఆంగ్ల సంచిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

కొత్త ఢిల్లీలోని ఇండియా ఇంటర్‌నేషనల్ సెంటర్ (ఐఐసి) లో **2023** నవంబరు **28** నుండి డిసెంబర్ **2** వరకు జరిగిన రెండవ ఇన్నోవేషన్ ఉత్సవాలలో పాల్గొన్న ఇన్నోవేషన్‌ల సంక్షిప్త వివరాలు, జాతీయ స్థాయిలో జరిగే ఈ ఉత్సవంలో పాల్గొనటమే గొప్పగా భావిస్తారు ఇన్నోవేటర్లు. - ఎడిటర్

### ఛానల్ తయారు చేసే యంత్రం:

### బిలాల్ అహ్మద్ అహంగర్,

అనంతనాగ్, జమ్ము & కాశ్మీర్.



**సమస్య:** పైకప్పుకు ఉపయోగించే ఇనుప రేకు షీట్లను ఛానల్ లోకి మార్చే సాంప్రదాయ పద్ధతులు సాధారణంగా చేతిపనిగా చేస్తారు లేదా ప్రత్యేకమైన ఛానల్ బీమ్ యంత్రాలను ఉపయోగించాలి. ఈ యంత్రాలు ఉపయోగించుకున్నా ఎక్కువ శ్రమ అవసరం అవుతుంది. ఇలాంటి యంత్రాలను కొనాలంటే చాలా పెట్టుబడి అవసరం అవుతుంది.

**పరిష్కారం :** ఈ సమస్య పరిష్కారానికి తక్కువ ఖర్చుతో, సమర్థవంతంగా పనిచేసే ఒక యంత్రాన్ని రూపొందించాడు ఇన్నోవేటర్ బిలాల్. ఈ యంత్రంలో వృత్తాకారంగా ఛానల్ ఆకారంలో తయారు చేసిన ఇనుప రోలర్లు ఉంటాయి. ఇవి ఇనుప షీట్లను నిర్దిష్ట స్థానాల్లో వంచి, ఛానల్ ఆకారంలోకి తయారు చేస్తుంది.

ఈ యంత్రంతో ఒక నిమిషంలో 30 మీటర్ల షీట్‌పై రెండు ఛానళ్లు తయారు చేయగలదు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**సమాజంపై ప్రభావం :** ఈ ఆవిష్కరణతో పని చేయడానికి చాలా తక్కువ శ్రమ అవసరం అవుతుంది. దీన్ని నడపటానికి ప్రత్యేక నైపుణ్యం అవసరం లేదు. కేవలం ముగ్గురు వ్యక్తులు చాలు. ఖర్చు కూడా తక్కువ. అందువల్ల చిన్న చిన్న ఫ్యాబ్రికేషన్ చేసే వారికి చాలా అనుకూలం గా ఉంటుంది.

**ప్రస్తుత పరిస్థితి :** ఆవిష్కర్త బిలాల్ అహ్మద్ ఎటువంటి ప్రభుత్వ గ్రాట్ లేదా ఆర్థిక సహాయం లేకుండానే ఒక నమూనా యంత్రం తయారు చేశాడు. స్థానిక 'గియాన్' సంస్థ బృందం వారి సహకారంతో ఇప్పటికే రెండు యంత్రాలను తయారు చేసి అమ్మగలిగాడు.

బిలాల్‌కు పెద్దగా విద్యాభ్యాసం లేకపోయినా, తన సృజనాత్మకతో ఇంజనీరింగ్ పరిష్కారాలను తయారు చేస్తుండటంతో తన ప్రాంతంలో మంచి గుర్తింపు పొందాడు. అందువల్ల చాలా మంది తమ సమస్యల పరిష్కారం కొరకు అతన్ని సంప్రదిస్తుటారు.



## హార్వెస్టర్ - వాషర్ గా పని చేసే ట్రాక్టర్ అనుసంధాన పరికరం:



### యాంగ్లెం బ్రజమణి సింగ్,

బిష్ణుపూర్, మణిపూర్.

**సమస్య:** మణిపూర్ రాష్ట్రంలోని కైనౌ గ్రామానికి చెందిన యాంగ్లెం బ్రజమణి సింగ్ ఒక సాధారణ చామదుంప పండించే కుటుంబానికి చెందిన వాడు. ఈ ప్రాంతలో చామదుంపలను కోయటానికి చాలా మంది కూలీలపై ఆధార పడాల్సి వస్తుంది. గునపాలతో నేలను త్రవ్వి, కందలను బయటకు తీయడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఒక ఎకరాకి రోజూ 5 మందికి పైగా కూలీలు కలిసి చాలా రోజులు పని చేయాల్సి వస్తుండేది. అందువల్ల రైతుకు కూలీ ఖర్చులు విపరీతంగా పెరిగి పోయింది.

**పరిష్కారం:** ఈ సమస్యకు పరిష్కారంగా యాంగ్లెం బ్రజమణి సింగ్ ట్రాక్టర్‌కు అమర్చుకునే ఒక ప్రత్యేకమైన 'హార్వెస్టర్ – వాషర్' పరికరాన్ని రూపొందించాడు. ఈ పరికరం ట్రాక్టర్ యొక్క పిటిఓ షాఫ్ట్ ద్వారా పని చేస్తుంది. యంత్రంలో అమర్చిన ఉక్కు బ్లేడ్ నేలను పెకిలించి, కంద గడ్డలను బయటకు తీస్తుంది. తరువాత అవి ట్రాక్టర్ వెనక భాగానికి వెళ్ళి ఒక సిలిండర్ ఆకారపు వాషింగ్ వ్యవస్థలో శుభ్రపరచ బడతాయి. ఈ యంత్రం 10 గంటల్లో సుమారు ఒక హెక్టారు పొలాన్ని కోయగలదు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి



**సమాజంపై ప్రభావం:** ఈ యంత్రం తయారు కావలం వల్ల రైతులకు పని చాలా సులువుగా మారింది. సాధారణంగా ఐదుగురు కూలీలు ఒక వారం రోజుల పాటు చేసే పనిని ఇప్పుడు ముగ్గురు వ్యక్తులు ఒక రోజులోనే పూర్తి చేయ గలుగుతున్నారు. దీనివల్ల రైతుల ఖర్చు చాలా వరకు తగ్గడమే కాక, పంటను సమయానికి మార్కెట్‌కు తీసుకు వెళ్ళ గలుగుతున్నారు. ఈ ఆవిష్కరణ ప్రయోజనాలను గురించి ఆయన తన జిల్లాలోని అనేక మంది రైతులకు తెలియజేస్తున్నాడు.

**ప్రస్తుత పరిస్థితి:** ఈ యంత్రాన్ని ఇంకా మెరుగు పరచి వాణిజ్యపరంగా తయారు చెయ్యాలన్న లక్ష్యంతో బ్రజమణి సింగ్ ప్రయత్నిస్తున్నాడు. ఈ ఆవిష్కరణకు గుర్తింపుగా 2023లో నేషన్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఇతనికి జాతీయ స్థాయి పురస్కారాన్ని అందజేసింది. ప్రస్తుతం తక్కువ ఖర్చుతో భాగాలను సమకూర్చుకొని, హైడ్రాలిక్ విధానంతో పనిచేసేలా మరింత మెరుగైన ట్రాక్టర్ హార్వెస్టర్‌ను అభివృద్ధి చేయాలని కృషి చేస్తున్నాడు.

## గనుల త్రవ్వకం వల్ల పాడైన భూమిని పునరుద్ధరించే ఎరువు:



### శ్రీమతి కిర్సియా రింగ్‌ఖ్లెం,

తూర్పు జైంటియా హిల్స్, మేఘాలయ.

**సమస్య:** మేఘాలయ రాష్ట్రంలోని ఈస్ట్ జైంటియా హిల్స్ ప్రాంతంలో బొగ్గు గనుల త్రవ్వకాల వల్ల అక్కడి పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గనుల కార్యకలాపాల కారణంగా ఒకప్పుడు సారవంతమైన భూములు బీడు భూములుగా మారిపోయాయి. దీనివల్ల రైతుల సంప్రదాయ జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా పర్యావరణ కాలుష్యం పెరిగి, ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం ఏర్పడింది.

**పనివిధానం:** ఈ సమస్యకు పరిష్కారంగా శ్రీమతి కిర్సియా ఒక ప్రత్యేకమైన సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని అభివృద్ధి చేశారు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి



తోటల్లో పెరిగే గడ్డిని ముందుగా ఎండబెట్టి మెత్తగా పొడిచేసి, దాన్ని ఒక గుంతలో ఆవుపేడ మరియు పంది పేడలతో కలిపి సుమారు 30 రోజుల పాటు మురగబెడుతుంది. తరువాత కలుపు మొక్కలు, అరెకా గింజల జూక్కలు (వక్క చెట్టు తొక్కలు) మరియు ఇతర జీవ పదార్థాల వ్యర్థాలను కూడా కలిపి మళ్ళీ ఎండబెడతారు. భూమిలో ఈ ఎరువును ఉపయోగించే ముందు నేలలో ఉండే అధిక ఆమ్లత్వాన్ని తగ్గించడానికి సున్నపు రాయిని ఉపయోగిస్తారు.

**సామాజిక ప్రభావం:** ఈ సేంద్రియ ఎరువు వాడటం వల్ల నేలలో నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం పెరిగి, భూమి సారవంతం మెరుగవుతుంది అన్నారు ఇన్నోవేటర్. ఆమె స్వంత పొలాల్లో ఈ విధానం ఉయోగించిన తరువా మూడు సంవత్సరాల వ్యవధిలో కూరగాయలు సమృద్ధిగా పండాయట. గత రెండు సంవత్సరాల్లో దాదాపు 300 హెక్టార్లలో 500 మంది రైతులు ఈ ఎరువును ఉపయోగించి మంచి ఫలితాలను పొందారు అని తెలిపారు.

**ప్రస్తుత పరిస్థితి:** మేఘాలయ బేసిన్ డవలప్‌మెంట్ అథారిటీ మరియు ప్రపంచ బ్యాంకు మద్దతతో అమలవుతున్న ఎంసిఎల్‌ఎల్‌ఎంపి ప్రాజెక్టు సహాయంతో ఆమె సేంద్రియ ఎరువు తయారీని మరింత విస్తరించారు. ఇప్పటివరకు దాదాపు రెండు టన్నుల సేంద్రియ ఎరువు తయారు చేసి, అందులో 1.79 టన్నులు విక్రయించారు. అదేవిధంగా భూమి పునరుద్ధరణపై విఎన్‌ఆర్‌ఎంసి మరియు విసిఎఫ్ సభ్యులకు ఆమె శిక్షణ కూడా అందిస్తున్నారు.

## తక్కువ ఖర్చుతో పవర్ టిల్లర్ మరియు ధాన్యం వేరు చేసే యంత్రం:



**శ్రీ హెజ్ఞ్యా క్లియెన్,**

రి–భోయ్ జిల్లా, మేఘాలయ.

**సమస్య:** చిన్న మరియు సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రాలు చాలా ఖరీదైనవి కావడం ఒక పెద్ద సమస్యగా ఉంది. అంతే కాకుండా యంత్రాలకు అవసరమైన ఇంధన ఖర్చులు కూడా ఎక్కువగా ఉండటంతో చాలా మంది రైతులు ఇప్పటికీ శ్రమతో కూడిన సాంప్రదాయ పద్ధతులపై ఆధార పడాల్సి వస్తోంది. దీనివల్ల వ్యవసాయ పనుల్లో సమయం ఎక్కువ తీసుకోవడం మాత్రమే కాకుండా పనితీరు కూడా కొన్నిసార్లు తక్కువగా ఉంటుంది.

**పని విధానం:** ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని హెజ్ఞ్యా క్లియెన్ అందుబాటులో వున్న పాత యంత్ర భాగాలు మరియు వ్యర్థ సామాన్లను ఉపయోగించి ఒక ధాన్యం వేరు చేసే యంత్రం (థ్రెషర్) తయారు చేశాడు. ఈ యంత్రం మొక్కల తలల నుంచి మొక్కజొన్న గింజలను వేగంగా వేరు చేస్తుంది. అదేవిధంగా ఆయన వెదురు బొంగులు మరియు పాత యంత్ర భాగాలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో పని చేసే ఒక పవర్ టిల్లర్ కూడా రూపొందించాడు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**సామాజిక ప్రభావం:** ఈ ఆవిష్కరణల వల్ల రైతుల చేతిపని భారం గణనీయంగా తగ్గింది.



సాధారణంగా ఏడు మంది ఒక వారం రోజుల్లో పూర్తి చేసే పనిని ఈ థ్రెషర్ సహాయంతో ఇద్దరు వ్యక్తులు తక్కువ సమయంలోనే పూర్తి చేస్తారు. అదేవిధంగా తక్కువ ఖర్చుతో తయారైన పవర్ టిల్లర్ వరి సాగులో సంప్రదాయంగా ఉపయోగించే ఎద్దుల పనిని కూడా సమర్థవంతంగా పూర్తి చేస్తోంది.

**ప్రస్తుత పరిస్థితి:** ప్రారంభ దశలో ఇతను తయారు చేసిన పవర్ టిల్లర్ టిల్లర్ మరియు థ్రెషింగ్ యంత్రాల్లో ఐదు చొప్పున అమ్మడు పోయాయి. తరువాత సిఎల్‌ఎల్‌ఎంపి ప్రాజెక్ట్ క్రింద ఇన్క్యూబేషన్ సహాయం లభించడంతో ఆయన ఈ యంత్రాలను మరింత మెరుగు పరిచాడు. ఇప్పుడు విస్తృతమైన మార్కెట్‌ను కూడా పొందుతున్నాడు. రాష్ట్రంలోని బేసిన్ డెవలప్‌మెంట్ అథారిటీ సహకరంతో దీనిని వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన యోచిస్తున్నారు. ●

### ఈ ఉత్సవాల్లో పాల్గొన్న తెలుగు ఇన్నోవేటర్లు

**కొడిముంజ ప్రవీణ్ -**
మల్బరీ మొక్కలను కత్తిరించి, కట్టలు కట్టే పరికరం.

**గోదాసు నర్సింహ -**
చెరువుల్లో 'గుర్రపుడెక్క' తీసివేసే యంత్రం.

**అల్లాడి ప్రభాకర్ -**
నడవలేని వ్యాధిగ్రస్తులకు పనికి వచ్చే మంచం.

**మోథా శివకుమార్ -**
చేనేతలో పెడల్ లిఫ్టింగ్ యంత్రం.

**శ్రీమతి దూబ రాజు -**
సహజ పంటలతో క్లీనింగ్ ద్రావణాలు.

**మెండె శ్రీనివాస్ -**
పొలాలకు, ఇళ్ళకు నీరు తోడేందుకు రోబో.

**నవంబర్-2025 న జరిగిన 4వ ఉత్సవంలో పాల్గొన్నావారు:**

**చింతకింది నరేందర్ -**
పోచంపల్లి నేతలో డిజైన్ మార్కింగ్ యంత్రం.

**షేక్ భాషా -**
మోటార్ సైకిల్‌కు వ్యవసాయ పరికరాల అమరిక.

**శ్రీనివాస రావు -**
చేపల చెరువుల్లో ఏరియేటర్.

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## వేసవి ఎండల నుండి శరీరాన్ని కాపాడుకునే చిట్కాలు


ఉమా మహేశ్వర రావు

ప్రస్తుతం ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. కొంచెం సుకుమారంగా పెరిగిన వాళ్ళు అసలు బయటకు వెళ్ళాలంటే కూడా భయపెట్టేంతగా వేడి వాతావరణం ఉన్న పరిస్థితి అందరికీ తెలిసిందే. ఈ ఎండలకు తప్పని సరి పరిస్థితుల్లో బయట తిరగాల్సి వస్తే శరీరంలో నీటి శాతం తగ్గిపోయి, డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ ఎండా కాలంలో బయటకు వెళ్ళే ముందు, వచ్చిన తర్వాత ఈ చిట్కాలను తప్పక పాటించినట్లయితే వడ దెబ్బ నుండి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు.

ముందుగు ఇంటి నుంచి బయటకు వెళ్ళే ప్రతి వ్యక్తి నెత్తిన టోపీ ధరించడం తప్పనిసరిగా చెయ్యాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రతి ఒక్కరూ బయటకు వెళ్ళే ముందు, వెళ్ళి వచ్చిన తర్వాత ఒక గ్లాసు మజ్జిగలో పావు చెంచా ఉప్పు, అర చెంచా పంచదార కలుపుకుని తప్పక సేవించాలి. ఎందుకంటే ఈ ఎండలకు శరీరంలోని నీరు అంతా ఆవిరై పోతుంది. దాన్ని కాపాడుకోవాలి అంటే శరీరానికి బయో కార్బనేట్లు అవసరం. వీటిని పొందాలంటే మజ్జిగలో పంచదార, ఉప్పు కలిపితే లభిస్తాయి.

ఎండా కాలం సాధారణంగా ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా సేవిస్తూ ఉండాలి. లేదంటే కిడ్నీలో రాళ్ళు ఏర్పడే ప్రమాదం, పైల్స్ (మొలలు) వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది కాబట్టి వీలైనంత వరకు శరీరానికి చలువ చేసే పదార్థాలు, పానీయాలు సేవిస్తూ ఉంటే మంచిది. చలువ చేసే పదార్థాలు, పుచ్చకాయ, దోసకాయ, కర్బూజ లాంటివి తీసుకుంటూ ఉండాలి. రోజుకు కనీసం రెండు – లేదా రెండున్నర లీటర్ల నీరు తప్పక సేవించాలి. ఈ పనులన్నీ ఎండా కాలం కిడ్నీలో రాళ్ళు ఏర్పడటానికి ఎక్కువ అవకాశం ఉన్నందున ఆ అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు ఇవన్నీ తప్పక చేయాల్సిన పనులు.

ఈ ఎండా కాలంలో మనకేముందిలే బయటకెళ్తే ఎసి కార్లో వెళ్తాము, ఇంట్లో ఉన్నా ఎసి రూముల్లో ఉంటాము అని అశ్రద్ధగా ఉండటం ప్రమాదకరం. ఎందుకంటే ఎసీ రూముల్లో ఉన్నా, ఎసి కార్లో బయటకు వెళ్ళినా అందులో నుంచి మీరు పీల్చేది కార్బండయాక్సైడ్ మాత్రమే కాబట్టి ఒక్క నిమిషం బయటకువచ్చినా సరే ఎండ ప్రభావం ఇంకా తీవ్రంగా మీమీద పడుతుంది. మీరు అందులో ఉన్నంతసేపే చల్లగా ఉంటారు. శరీరం బయట ఎంత వేడిమి ఉందో అదే గ్రహిస్తుంది. అంతెందుకు మనం చల్లటి పానీయాలు త్రాగేటపుడు చాలా ఆహ్లాదంగా ఉంటుంది. కానీ, మీరు త్రాగిన అవే నీళ్ళు కాసేపటి తర్వాత శరీరంలో విపరీతమైన వేడిని కలిగిస్తాయి. అదే కుండలో నీళ్ళు త్రాగి చూడండి అవి వేడి చెయ్యవు. మన శరీర తత్వం అది. అందుకే కృత్రిమ చల్లని పదార్థా లు, పానీయాలు కాకుండా సహజ సిద్ధంగా శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే వాటిని మాత్రమే తీసుకోవడం ఉత్తమం. వీలైనంత వరకు జావలు తయారు చేసుకుని త్రాగితే మంచిది.

మార్చి నెలాఖరు నుంచి జూన్ మొదటి వారం వరకు ఉల్లిగడ్డను ముక్కలుగా చేసి, నెయ్యిలో వేయించి, వాటిని కూరలో లేదా ఇతర ఆహార పదార్థాల్లో కలుపుకుని తింటూ ఉన్నట్లయితే శరీరంలో 'గ్లూకోజ్' శాతం పెరగకుండా కాపాడు కోవచ్చు. ఈ పని మధుమేహం (షుగర్) ఉన్నవాళ్ళు కూడా ఉపయోగించుకోవచ్చు. ఇలా చేయటం వల్ల రక్త దోషాలు ఉండవు, శరీరానికి మంచి బలాన్ని కూడా ఇస్తాయి.

అప్పుడప్పుడూ 'పసుపు' + 'తేనె' కలిపి తీసుకుంటూ ఉన్నట్లయితే అది మన శరీరంలో ఎంత వేడి ఉండాలో అంతే ఉంచి, మిగతా ఉష్ణాన్ని అంతా బయటకు వెళ్ళేలా చేస్తుంది.

వంటింట్లో పోపు గింజలు అంటే మనం కొట్లో వాడు ఏవి కలిపి ఇస్తే అవి వాడకుండా, మినప పప్పు, శనగ పప్పు, ఆవాలు, జీలకర్ర, 4 మెంతులు, 4 వాము గింజలు' కలిపి మీరే స్వయంగా పోపు గింజలను తయారు చేసుకుని, కనీసం ఈ ఎండా కాలం వెళ్ళే దాకా ఉపయోగించినట్లయితే వాటికి శరీరాన్ని సమశీతోష్ణంగా ఉంచే గుణం ఉంటుంది.

ఈ ఎండా కాలం ఎక్కడన్నా కాలింది అనుకోండి అది మహా బాధ పెడుతుంది. అలా జరిగినప్పుడు మెంతులు తీసుకుని, మెత్తగా నూరి, ఆ పిండిని నెయ్యి లేదా ఆముదం నూనెలో కలిపి కాలిన గాయం పైన పూసినట్లయితే ఆ బొబ్బలు పెరగవు, పైగా త్వరగా మానిపోతాయి.

శరీరంలో ఎక్కడ బాధగా ఉన్నా సరే 'బిర్యాని' ఆకు తీసుకుని మెత్తగా నూరి, అందులో కొద్దిగా నీటిని కలిపి తలకు పట్టించుకుంటే శరీరంలో ఎక్కడ బాధ ఉన్నా అది తొలగించి వేస్తుంది. ఎందుకంటే శరీరానికి తల నుంచే రక్త ప్రసరణ వెళ్తుంది. కాబట్టి ఏ భాగంలో బాధ ఉన్నా అది తొలగిస్తుంది. ●

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# వేసవి కాలంలో ఆరోగ్యం కోసం కొన్ని చిట్కాలు



కొమెర అంకారావు

**శరీరంలోని వేడి (ఉష్ణం) చల్లబడటానికి ....:**

1. వేసవి కాలంలో విపరీతమైన శరీరంలో విపరీతమైన వేడిని తగ్గించ టానికి 'సుగంధ పాల చెట్టు' వేర్లను తీసుకుని, శుభ్రంగా కడిగిన తర్వాత ఒక పాత్రలో ఆ వేర్లను నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే పాత్రలోని వేర్లను తీసివేసి నీటిని త్రాగాలి. ఇలా ఒక వారం రోజులు చేసినట్లయితే శరీరంలోని వేడి పూర్తిగా తగ్గిపోతుంది.



2. ఎండు ఖర్జూర పండ్లు 1–2 తీసుకుని వాటిని రాయితో కచ్చ కచ్చ కచ్చగా దంచి, అందులోని విత్తనాలను తీసివేసి, పండ్లను ఒక పాత్రలో కొంత నీరు తీసుకుని అందులో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ ఖర్జూర పండ్లను నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి, తర్వాత ఆ నీటిని కూడా త్రాగాలి. ఇలా చేసినా కూడా శరీరం లోని వేడి తగ్గిపోతుంది. ఆ నీటిని త్రాగే ముందు అందులో నుండి ఒకటి రెండు చుక్కలు కంట్లో వేసుకుంటే ఇంకా మంచిది. కళ్ళు కూడా వేడిమి నుండి చల్లబడతాయి.



3. రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో ఒక పాత బెల్లం ముక్క, కొద్దిగా యాలకుల పొడి వేసి నానబెట్టాలి. ఇలా చేసినా కూడా శరీరం లోని వేడి బాగా చల్లబడుతుంది.

4. తాజాగా చేసిన మజ్జిగ కాకుండా, రాత్రి మజ్జిగ చేసుకుని, దాన్ని ఒక గ్లాసులో వేసి ఉంచుకుని, ఉదయాన్నే పరగడుపున అందులో ఉప్పు, పంచదార లాంటివి ఏవీ వేసుకోకుండా త్రాగితే వేసవి కాలం చాలా మంచిది.

5. దూసర తీగ (దీన్నే తిప్పతీగ, పాతాళ గరుడ అంటారు) ఆకులు రెండు గుప్పిళ్ళు తీసుకుని, ఒక పాత్రలో వాటిని వేసి, చేతితో బాగా నలిపి, పిసికినట్లయితే అందులోని రసం పాత్రలోకి వస్తుంది. ఆ తర్వాత ఆ ఆకు పిప్పిని తీసివేసి, కొద్ది సేపు ఉన్నట్లయితే ఆ దూసర తీగ ఆకుల రసం కాస్త గట్టిపడుతుంది. అందులో కొద్దిగా బెల్లం వేసుకుని ఉదయాన్నే త్రాగినట్లయితే శరీరాన్ని వేడి నుండి రక్షిస్తుంది.



**'సయాటిక' వల్ల వచ్చే నొప్పినుండి నివారణ పొందటానికి .....:**

1. 'సయాటిక' సమస్య ఉన్నవాళ్ళు అనుభవించే కాలి నొప్పి వర్ణణా తీతం. కొద్దిగా నడవలేరు, కాసేపు నిలబడలేరు, ఎప్పుడూ కూర్చోవ టం (అది కూడా వెన్నెముక బాగా ఆనుకునేలా కూర్చోవడం), లేదా పడుకోవటం చేస్తూ ఉంటారు. అయినా సరే కొందరిలో నొప్పి విపరీతంగా ఉండటం వల్ల ఆ బాధను భరించడం నరకప్రాయ కంగా ఉంటుంది. ఈ సయాటికా నొప్పి నుండి నివారణ పొందటా నికి గుప్పెడు 'పారిజాతం' పూలచెట్టు ఆకులు తీసుకుని చేతితో కొద్దిగా నలిపి, ఆ ముద్దను ఒక గ్లాసు నీటిలో వేసి, పొయ్యిమీద పెట్టి ఆ నీరు సగం అయ్యే దాకా మరిగించాలి. చల్లారిన తర్వాత ఆ కషా యాన్ని పరగడుపున తీసుకుంటూ ఉన్నట్లయితే సయాటికా నొప్పి చాలా వరకు తగ్గిపోతుంది. ఆ నీరు చల్లారక పోయినా వేడి నీటినైనా వడబోసి టీ త్రాగినట్లు త్రాగినా సరే. ఇలా చేయటం వల్ల కీళ్ళ నొప్పులు, మోకాలి నొప్పులు కూడా నయమై పోతాయి.



2. సయాటికా నొప్పి నివారణకు మరొక చిట్కా.... శొంఠిపొడి మూడు వేళ్ళతో తీసుకుని, ఒక గ్లాసులో వేసి బాగా మరిగించిన తర్వాత అందులో కొద్దిగా (3–4 చుక్కలు) వంట ఆముదం వేసుకుని త్రాగినట్లయితే కూడా యాటికా నొప్పి తగ్గిపోతుంది.

'పల్లెసృజన' ప్రచురణ నవంబర్ – డిశంబర్ 2025 సంచికతో ముద్రణ ఆపివేయ బడింది. ఆ తరువాత వెలువడుతున్న 'డిజిటల్ సంచిక' ఇదే. కాస్త ఆలస్యమైంది, క్షమార్హులం.

వందలకొద్దీ పాఠకులు ఫోన్ ద్వారా ప్రచురణ ఆపివేయడాన్ని ఒప్పుకోలేక, ప్రచురణ లేమిని మాతో పంచుకున్నారు. మా ఉద్దేశ్యంలో ఇదొక కాలానుగుణ్యమైన మార్పు. దీనివల్ల పల్లెసృజన పాఠకులు పత్రిక చదవాలంటే కొంత బాధ్యత వహించాల్సి వస్తోంది. అందరూ https://pallesrujana.org/ నుండి పత్రికను డౌన్‌లోడ్ చేసి, కనీసం 10 కాపీలు ప్రింట్ చేయండి. ఆ కాపీలను మీ మిత్ర బందంలో, దగ్గర పాఠశాలల్లో, గ్రంథాలయాల్లో పంచండి. ఈ విధంగా పల్లెసృజన సంస్థ చేపట్టిన 'పల్లెజ్ఞాన ప్రసరణ' విస్తృతం చేయడంలో మీరంతా భాగస్వాములౌతారు.

మనమంతా సహచర్యంతో, సహకారంతో సమాజంలో ఒక మంచి కార్యాన్ని విజయవంతంగా చేద్దాం. పల్లెజ్ఞాన ప్రసరణలో భాగంగా తెలుగు పాఠకులంతా కలిసి పల్లెసృజన పత్రికను వేలాది మందికి చేరుద్దాం. అలా జరిగితే కలిగే ఆనందం, తృప్తి మనందరిది కదా!

– పల్లెసృజన బృందం

## రైతుల కొరకు రైతులు చేసిన ఇన్నోవేషన్ల సదస్సుకు ఆహ్వానం

గ్రామ సర్పంచులకు, ప్రజా ప్రతినిధులకు,

రైతుల కొరకు రైతులు తయారు చేసిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల సదస్సు 'పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు అందరూ ఆహ్వానితులే.

ఈ సదస్సులో రైతుల సమస్యలకు సరళమైన, అందుబాటులో ఉండే వ్యవసాయ యంత్ర పరికరాలు, చేతి పనిముట్లు, యంత్ర పరికరాలు, విత్తనాలు, మొక్కలు, బయో పెస్టిసైడ్స్, సేంద్రియ పురుగు మందులు, పశు మరియు మానవ ఆరోగ్యానికి చెందిన సూచనలు, మందులు లాంటి రైతులు ఆవిష్కరించిన జ్ఞానాన్ని ఈ సదస్సులో ప్రదర్శించ బడును. మీ సమస్యలు చర్చించి, పరిష్కారాలు సాధించుటకు ప్రయత్నాలు చేయబడును.

**తేది:** 02-05-2026,

**స్థలం:** పల్లెసృజన కార్యాలయం,
ప్లాట్ నెం. 77, వాయుపురి, సైనిక్ పురి పోస్ట్, సికింద్రాబాద్, తెలంగాణ.

ఇది ప్రథమ సదస్సు. రైతుల తోడ్పాటు ఆశాజనకంగా ఉంటే ప్రతి శనివారం పల్లెసృజన కార్యాలయంలో ఏర్పాటు చేస్తుంది. కొత్తగా ఎన్నికైన యువ సర్పంచులు ఈ 'జ్ఞాన ప్రసరణ' అవకాశాన్ని వినియోగించుకొని, వారి వారి గ్రామాల్లో వ్యవసాయాన్ని, చేనేతని, ఇతర జీవనోపాదులని లాభకరంగా చేస్తారని ఆశిస్తున్నాం.

ఈ సదస్సుకు రాదలచుకున్న వారు ముందుగా మీ పేరు నమోదు చేసుకో గలరు.

ఒక రోజు ముందుగా మేము మీ హాజరును నిర్ధారిస్తాము.



పూర్తి వివరాలకు సంప్రదించండి :
సుభాష్ చందర్,
సి.ఇ.ఓ., క్రియేటివ్ మైండ్స్,
ఫోన్ : 96528 01700

Creative Minds
Leading Innovation....

Palle Srujana
పల్లెసృజన
pallesrujana.org

IndianOil Gyanodaya

iSpark
Indian Oil Student Park of innovation

honeybee.org

nifindia.org





## ఆవిష్కరణ

### 1. కలుపు తీసే కుర్ఫీ, బుష్ వీడర్
### 2. స్కైతి - కొడవలి+గొడ్డలి

ఇన్నోవేటర్

## నిహాల్ అత్తర్

పూణే, మహారాష్ట్ర

**కుర్ఫీ :**

1. సాధారణంగా మహిళలు కూర్చుని లేదా వంగుని కలుము తీయటం వల్ల విపరీతమైన అలసట, నడుం నొప్పులకు గురౌతారు.
2. అలా పని చేయుటం వల్ల కలుపు తీసే పని వేగంగా జరగదు.
3. కలుపు తీయుటానికి ప్రధానంగా మహిళా కూలీలే అవసరం.
4. ఒక వయసు దాటిన తర్వాత కూర్చోలేరు కాబట్టి కలుపు తీసే పని చేయుటం కష్టం.
5. ఈ 'కుర్ఫీ' పరికరంతో చిన్న పిల్లవాడి నుండి, వయసు మీరిన మగ లేదా ఆడ ఎవరైనా సరే కలుపు తీయవచ్చు.
6. కూర్చోవటం, వంగటం లాంటి అవసరం లేకుండా నిల్చునే, అలుపు లేకుండా కలుపు తీయవచ్చు.
7. పదిమంది చేసే పనిని కేవలం ఇద్దరితో పూర్తి చేయవచ్చు. కాబట్టి 80 శాతం వరకు కలుపు తీసే కూలీలు ఆదా.
8. ఏ పైరులోనైనా సరే సులభంగా కలుపు తీసుకోవచ్చు.
9. కేవలం మహిళలే కలుపు తీయాల్సిన అవసరం లేదు.

**బుష్ వీడర్ :**

1. నాణ్యమైన స్టీలు (స్ప్రింగ్ స్టీల్)తో, లేజర్ కట్టింగ్ ద్వారా తయారు చేయబడినది కాబట్టి మన్నిక ఎక్కువ.
2. చేతికి అనువుగా, నాణ్యతతో కూడిన చెక్క పిడి అమర్చబడింది.
3. తక్కువ బరువు, ఎక్కువ సామర్థ్యతతో పని చేసే పరికరం.
4. కొడవలితో 2-3 నిమిషాలు తొలగించే కలుపును ఈ బుష్ వీడర్‌తో 2-3 సెకండ్లతో వేర్లతో సహా పెకిలించి తీసివేయొచ్చు.
5. తక్కువ శ్రమతో కలుపును సమూలంగా తీసివేసే పరికరం.

**'స్కైతి' :**

1. నాణ్యమైన స్టీలు (స్ప్రింగ్ స్టీల్) తో, లేజర్ కట్టింగ్ ద్వారా తయారు చేయబడినది కాబట్టి మన్నిక ఎక్కువ, పదును ఎక్కువ.
2. చేతికి అనువుగా, నాణ్యతతో కూడిన, తేలికైన ఇనుప గొట్టం అమర్చబడింది.
3. తక్కువ బరువు, ఎక్కువ సామర్థ్యతతో పని చేసే పరికరం.
4. ఎత్తయిన చెట్లకున్న అనవసరమైన లేదా ఎండిన కొమ్మల్ని నరికి వేయాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని ఈ 'స్కైతి' తో చాలా సులభంగా చేయవచ్చు.
5. పొలం గట్లు అనవసరపు పిచ్చి మొక్కలు, కంప చెట్లతో పెరిగిపోతున్నపుడు ఈ 'స్కైతి'తో సులభంగా శుభ్రం చేసుకోవచ్చు.
6. ముఖ్యంగా పామొలిన్ తోటల్లో కొమ్మలు కత్తిరించ డానికి, పండ్ల గుత్తి కత్తిరించడానికి ఎంతో అనువైన పదునైనది. చాలా మంది రైతులు దీన్ని వినియోగించి, చాలా బాగుందని కితాబునిచ్చారు.

**Palle Srujana**

77, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. Telangana
Phone :9866001678
E-mail : president@pallesrujana.org ; Visit us : www.pallesrujana.org

పరికరాల కొరకు సంప్రదించండి :
వీర రాఘవ రెడ్డి, పల్లె కిసాన్, ఫోన్ : 81257 99904.
సుభాష్ చందర్, క్రియేటివ్ మైండ్స్, ఫోన్ : 96528 01700

PALLE SRUJANA Telugu Bi-monthly January - April 2026 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**

